



ఉపాధిలో.. పశుగ్రాసం సాగు

- రైతులు, పోషకులకు ప్రభుత్వం ఊతం
- నూరు శాతం రాయితీతో పథకం అమలు
- గరిష్ఠంగా అరెకరంలో సాగుకు ప్రోత్సాహం
- లబ్ధిదారుల ఎంపికలో అధికంగా రాజకీయ జోక్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతులు, పశుపోషకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే మినీ గోకులాల పథకం కింద షెడ్ల నిర్మాణాలను చేపట్టారు. చిన్న.. సన్నకారు రైతుల కోసం కొత్తగా పశుగ్రాస సాగు పథకాన్ని ప్రవేశపెట్టింది. పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం ఆర్థికంగా ఊతం ఇస్తోంది. గ్రాసం పెంపకం పథకానికి ఉపాధి హామీ నిధులు వెచ్చిస్తున్నారు. ఈ పథకాన్ని నూరు శాతం రాయితీతో అమలు చేస్తున్నారు. గరిష్ఠంగా అర ఎకరంలో పశుగ్రాసం పెంచుకు నేందుకు ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తోంది. రైతుల్లో ఎక్కువ మంది వ్యవసాయానికి తోడుగా పాడిని చేపడుతుంటారు. గేదెలు.. ఆవులు పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పశుగ్రాసానికి ఇప్పటి వరకు పెద్దగా కొరత లేదు. వేసవిలో గ్రాసం కొరత తలెత్తే పరిస్థితులు ఉంటాయన్న అంచనా. ఈ పరిస్థితుల్లో నీటి ఆధారం ఉన్న రైతులు ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో పశుగ్రాసం సాగు చేసుకోవచ్చు. తద్వారా పచ్చి మేతను పాడి పశువులకు అందించొచ్చు. ఒక్కో మండలానికి 35 నుంచి 45 ఎకరాల వరకు సాగుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. వీరికి ఖచ్చితంగా ఉపాధి జాబ్ కార్డు కలిగి ఉండాలి. అర్హులైనవారు సమీపంలోని పశువైద్యులు.. రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు పొలానికి సంబంధించిన 1బీ, జాబ్ కార్డు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం నకలు కాపీలను జత చేయాలి. గ్రామ సభ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులు పశుగ్రాసం సాగుకు అర్హులు.

నిధుల కేటాయింపు ఇలా..

పది సెంట్లలో పశుగ్రాసాల పెంపకానికి కూలి ఖర్చు కింద రూ.3 వేలు, సామగ్రి ఖర్చుల కింద విత్తనం కొనుగోలుకు రూ.3,599, మొత్తంగా రూ.6,599 చెల్లి స్తారు. 50 సెంట్లలో పెంపకా నికి వేతనం కింద రూ.15 వేలు, విత్తన ఖర్చు లకు రూ.17,992 అందజేస్తారు. ఉపాధి పథకం అధికారులు, పశువైద్యులు ధ్రువీకరణ చేసిన అనంతరం రైతులకు బిల్లులు చెల్లిస్తారు.

100 రోజుల ఉపాధి హామీ
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం

జిల్లాకు వెయ్యి ఎకరాలు..

ఒక్కొక్క జిల్లాకు వెయ్యి ఎకరాల్లో ప్రశు గ్రాసం పెంపకం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో ఒక్కొక్క జిల్లాలో వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చిన్న.. సన్న కారు రైతులు గ్రాసం పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో రైతుల నుంచి దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలోనే వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం అధికంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. పశువులు లేని రైతులు కూడా ఈ పథకం కింద దరఖాస్తులు ఇస్తున్నారన్న విమర్శ లున్నాయి. పశువుల పెంపకంపై ఆధారపడి జీవించే రైతులకు ఈ పథకంలో ప్రాధాన్యం ఇవ్వాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు. రైతులు విస్తృత ప్రయోజనాల కోసం ప్రవేశ పెట్టిన పశుగ్రాస పథకంపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేనిపక్షంలో అర్హులకు అన్యాయం జరగడంతో పాటు పథకం లక్ష్యాలు నీరుగారిపోయే ప్రమాదం ఉంది.

ఆ.. చేద్దాంలే

అలక్ష్యం.. 'ప్రభుత్వ లెక్కల ప్రకారం గుంటూరు జిల్లాలో 10326 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో ఎన్ని ఉనికిలో ఉన్నాయో తెలియదు. ఆ లెక్క తేల్చేందుకు ప్రభుత్వం సర్వే ఆరంభించింది. సచివాలయ సిబ్బంది ఈ సర్వేపై ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో సదరు సర్వే నత్తకంటే నిదానంగా సాగుతోంది. రోజువారీ నివేదికలో జిల్లా వెనుకబడే ఉంది.'

అబద్ధం.. 'పెన్షన్ల పంపిణీ రోజున జిల్లా అధికారులు తక్కెళ్లపాడు వెళ్లారు. అక్కడ పెన్షన్లు అందిస్తున్న సచివాలయ ఉద్యోగి ఓ చోట కూర్చొని అందరినీ అక్కడకు పిలిపించి పంపిణీ చేస్తున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తిని కూడా అదేవిధంగా పిలిపించి పెన్షన్ ఇచ్చారు. జిల్లా అధికారి ఇదేమిటని నిలదీస్తే ఆ వ్యక్తి ఇల్లు ఇక్కడే అని ఉద్యోగి సమాధానం ఇచ్చారు. ఏది చూద్దాం పదా అని జిల్లా అధికారి పెన్షన్ దారుడు ఇంటికి వెళ్తే అది సుమారు అర కిలోమీటరు పైనే ఉంది. అంత దూరం నుంచి కాళ్లు ఈడ్చుకుంటూ పెన్షన్ కోసం రావాల్సి వచ్చింది.'

అలసత్వం ఇటీవల ప్రత్తిపాడు మండలం యనమదలలో సిబ్బంది సచివాలయం తలుపులు తీసేసి వెళ్లిపోయారు. సచివాలయంలో విలువైన రికార్డులు, కంప్యూటర్లు, ప్రింటర్లు అనేకం ఉన్నా వాటిని గాలికి వదిలేశారు. పనుల కోసం వచ్చిన వారు సచివాలయంలో అన్ని సీట్లు ఖాళీగా ఉండటం.. ఎంతసేపు వేచి ఉన్నా ఒక్కరు కూడా రాకపోవడంతో గ్రామస్తులు విసుపోవాల్సి వచ్చింది. తలుపులు బార్లా తీసి వెళ్లిపోవడంలో ఉద్యోగుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.



ప్రత్తిపాడు మండలం యనమదల సచివాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల సీట్లు (పాతచిత్రం)

- సచివాలయాల్లో నిర్లక్ష్య ధోరణి
- నత్తనడకన సాగుతోన్న పరిశ్రమల సర్వే
- ప్రభుత్వ ఆదేశాలపై ఉద్యోగుల అలసత్వం
- సామాజిక పింఛన్ల పంపిణీలోనూ అదే తీరు
- ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలన్నా పట్టించుకోని వైనం
- తనిఖీల్లో పరిస్థితి చూసి బిత్తరపోతున్న ఉన్నతాధికారులు
- అడిగినంత నగదు ఇస్తే ఏ సర్టిఫికెట్ అయినా జారీ చేస్తోన్న ఉద్యోగులు



సకాలంలో విధులకు హాజరు కావాలి.. పనుల కోసం వచ్చే వారిని తిప్పించుకోకూడదు.. సామాజిక పింఛన్లు ఇళ్ల వద్దే పంపిణీ చేయాలి.. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలపై ఎప్పటికప్పుడు స్పందించాలి... అని ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు సూచిస్తోంది. అయితే ప్రతీ అంశంలోనూ సచివాలయ ఉద్యోగుల్లో నిర్లక్ష్యం.. అలక్ష్యం.. అశ్రద్ధ.. అవినీతి.. కనిపిస్తోంది. కొన్ని సచివాలయాల పరిధిలో ఉద్యోగులు 11 గంటలకు కూడా రావడంలేదని.. ఏదైనా పనిపై వెళ్తే సరైన సమాధానం ఉండటంలేదని.. ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తనిఖీల సమయంలోనూ ఉద్యోగుల సమయపాలన.. పనులపై నిర్లక్ష్యం.. ఆదేశాలపై అలక్ష్యం.. తేటతెల్లమవుతోంది. కొన్నిసార్లు నిర్లక్ష్యంగా ఉండే ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నా.. వారి పనితీరులో మాత్రం మార్పు ఉండటంలేదని ఉన్నతాధికారులే వాపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కొందరు సచివాలయ ఉద్యోగుల పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

గుంటూరు సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏ పని చెప్పినా సిబ్బంది సాచివేత ధోరణి.. ప్రభుత్వ ఆదేశాలను కూడా పట్టించుకోవడంలేదు.. ఇదీ పలు సచివాలయాల్లోని ఉద్యోగుల తీరని కొందరు జిల్లా అధికారుల అభిప్రాయం. కొందరు సచివాలయ ఉద్యోగులు పనుల కోసం వచ్చే వారిని మామూళ్ల కోసం పీడిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేసినా తమకు ఏమీ కాదన్న ధోరణిలో కొందరు ఉన్నారు. పరిశ్రమల సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉండగా.. దానిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యధోరణిలో ఉన్నారు. ఈ సర్వే అంశంలోనే సచివాలయ ఉద్యోగుల పనితీరు తెలుస్తోందని పలువురు ఉన్నతాధికారులు వాపోతున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎక్కడ.. ఎన్ని ఉనికిలో ఉన్నాయో తెలిస్తే వాటికి మరిన్ని ప్రోత్సాహకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సర్వే పూర్తి అయితేనే పరిశ్రమల లెక్క తెలుస్తోంది. అందుకు సంబంధించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రానికి వస్తాయి. గతంలో ఒకసారి ఈ సర్వే ఆరంభించి మధ్య లోనే నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ సర్వే ఆరంభించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో జరుగుతున్న పరిశ్రమల సర్వే చాలా నిదానంగా జరుగుతుంది. సర్వేకి సంబంధించి ఉదాహరణకు ఈ నెల 4న నివేదికను పరిశీస్తే.. గుంటూ రు జిల్లాలో 10326 పరిశ్రమలు ఉండగా, ఆ రోజు వరకు కేవలం 2591 మాత్రమే సర్వే పూర్తి చేశారు. ఆ తర్వాత రోజు నుంచి ఆ సంఖ్య దాటడం లేదు. కొన్ని సచివాలయాల్లో రోజుకు 20 కంటే ఎక్కువ సర్వే జరగడం లేదు. ఈ నివేదికలు చూసి జిల్లా అధికారులు సైతం నిత్యం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఉద్యోగుల తీరులో మార్పు రావడంలేదు.

పెన్షన్ పంపిణీ విధానమే..

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ విధానాన్ని కొందరు సచివాలయ ఉద్యోగులు మార్చేశారు. ప్రతి ఇంటికి ఉద్యోగులు వెళ్లి పెన్షన్ అందజేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే కొందరు ఉద్యోగులు ఒక చోట కూర్చొని లబ్ధిదారులను పిలిపించి ఇస్తున్నారు. జిల్లా అధికారుల ఆకస్మిక తనిఖీలో ఇదే విషయాలు వెలుగు చూస్తున్నాయి. చివరకు ముఖ్యమంత్రి కూడా ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇస్తుంటే కొందరు సిబ్బంది ఇలా ఎందుకు చేస్తున్నారన్నది జవాబు దొరకని ప్రశ్నగా ఉంది. ప్రభుత్వం నుంచి వస్తున్న ఆదేశాల్లో లోపాలను వెతికి వివాదాలు సృష్టిస్తున్న సచివాలయ ఉద్యోగులను (మిగతా 8వ పేజీలో)

పరిశ్రమల స్థాపనతోనే ఉత్పాదకత

- అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- పల్లెపండుగలో పూర్తి చేసి పనులను ప్రారంభించాలి
- పథకాల పురోగతిపై సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతో ఉత్పాదకత పెరుగుతుందని తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పరిశ్రమలు, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ లలో అమలౌతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అధికారులు నిర్లిప్తంగా ఉంటే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కొరిశపాడులో రూ.245.66 కోట్లతో విత్తనాలతో డీజిల్ ఉత్పత్తి చేసే పరిశ్రమను నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కర్లపాలెం మండలంలో రూ.120 కోట్లతో ఏర్పాటు చేసే పరిశ్రమ ద్వారా 800మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. చీరాల ఇండస్ట్రీయల్ క్లస్టర్‌లో రూ.10 కోట్లతో వైద్యరంగానికి అనుబంధమైన యూనిట్ స్థాపనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద ఇప్పటి వరకు 36,100 దరఖాస్తులు రాగా 2,649 మందికి యూనిట్లు మంజూరు చేశామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల విద్యుత్ కనెక్షన్ల సర్వే వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 45,482 విద్యుత్ కనెక్షన్లు పరిశ్రమ కేటగిరిలో ఉండగా ప్రస్తుతం 8,260 కనెక్షన్ల సర్వే పూర్తిపై ఆరా తీశారు. పొదుపు మహిళల జీవనోపాధి పెంచటానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

- పల్లెపండుగ పనులు త్వరగా పూర్తి చేసి ఈ నెలాఖరిలో ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. జిల్లాకు 656 పనులు మంజూరు కాగా కేవలం 260 మాత్రమే పూర్తి కావడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు? సంక్రాంతికి పనులు పూర్తి కావాలన్నారు. మార్చికి 45.78 కిలోమీటర్ల సీసీరోడ్ల నిర్మాణానికి మంజూరు చేస్తామన్నారు. చీరాల ఓడరేవు నుంచి సూర్యలంక వరకు తీరంవెంబడి గ్రామాలను అనుసంధానం చేస్తూ సీసీరోడ్డు నిర్మించాలన్నారు. నిరుపేదలు వలస వెళ్లడానికి వీలులేదని కలెక్టర్ చెప్పారు.
- సురక్షితమైన తాగునీరు ప్రతి గృహానికి పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో 3,64,788 గృహాలు ఉండగా 1,48,361 గృహాలకు ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయని మిగిలిన వాటికి లేకపోవడం బాధాకరమన్నారు. నిధులు రాగానే కృష్ణా బ్యారేజి, ఎన్ఎస్పీ, గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నుంచి నీటిని ప్రతిరోజు ప్రతి గృహానికి సరఫరా చేయడమే లక్ష్యమన్నారు. 109 సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించకపోవడంపై అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. సచివాలయాలు, పాఠశాలలు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద తప్పనిసరిగా మరుగుదొడ్లు ఉండేలా చూడాలని లేకుంటే తక్షణమే నిర్మించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, వివిధశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నేడు జాతికి అంకితం

చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిలో చిలకలూరిపేట వద్ద సుమారు రూ.వెయ్యి కోట్లతో నిర్మించిన 16.4 కిలోమీటర్ల ఆరు లైన్ల బైపాస్ రోడ్డును ప్రధాని మోదీ బుధవారం జాతికి అంకితం చేయనున్నారు. విశాఖపట్నంలో జరిగే పలు కార్యక్రమాలలో భాగంగా ప్రధాని వర్చువల్‌గా ఈ రోడ్డును ప్రారంభిస్తారు. -చిలకలూరిపేట



పందెం కోళ్లకు భలే గిరాకీ!

- సంక్రాంతి బరికి సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

8

ముక్కోటి ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

దారిదోపిడీ కేసులో నలుగురు అరెస్టు

- నిందితులందరూ బాపట్ల పట్టణవాసులే..

6

సదస్సులతో సమస్యలకు చెక్ పడేనా?

- నేటితో ముగియనున్న రెవెన్యూ సదస్సులు
- ప్రజల నుంచి భారీగా అభ్యంతరాల స్వీకరణ
- వచ్చిన అర్జీల్లో 80 శాతం మ్యుటేషన్ వివాదాలే
- 5,837 రాక 3,317 పిటిషన్ల పరిష్కారం.. 2520 పెండింగ్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల వైసీపీ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా భూములను చెరబట్టడమే కాకుండా రాజకీయ జోక్యంతో వేలాది ఎకరాలను వివాదంలో పడేసి ఎంతోమందిని బాధితులుగా మార్చారు. వారి గోడు వినకపోగా తిరిగి వారిపైనే కేసులు బనాయించి భూ మాఫియాకు వైసీపీ నేతలు అండగా నిలిచారన్న విమర్శలు, ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. గత ప్రభుత్వంలో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడమే కాకుండా వాటిని వైసీపీ నేతలే హస్తగతం చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఈ పరంపరలోనే కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో భూవివాదాలకు పరిష్కారం దొరుకుతుందనే ఆశతో పెద్ద సంఖ్యలో బాధితులు అధికారులను ఆశ్రయించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఎక్కువగా భూవివాదాలకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. ప్రజాదర్బార్లలో సైతం ఎక్కువగా భూ బాధితులే ఉన్నారు. ఈ క్రమంలో ఆయా సమస్యలకు చెక్ పెట్టడంపై కూటమి ప్రభుత్వం ఆరంభం నుంచే దృష్టి సారించింది. రెవెన్యూ గ్రామాల ప్రామాణికంగా సదస్సులు నిర్వహించి భూ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిసెంబరు 6 నుంచి వాటికి శ్రీకారం చుట్టగా జనవరి 8 బుధవారంతో సదస్సులు ముగియనున్నాయి. ఒక్కో మండలంలో రోజుకు ఒక గ్రామంలో సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామంలోని భూ బాధితుల సమస్యలతో మళ్లీ అధికారులను ఆశ్రయించకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ఒక్కో గ్రామంలో ఉండేలా షెడ్యూల్ రూపొందించుకుని సదస్సులపై బాధితుల నుంచి అర్జీల స్వీకరణ.. కొన్ని అక్కడికక్కడే పరిష్కరిస్తూ వచ్చారు. చివరిగా ఈ నెల 8 బుధవారం కొన్ని గ్రామాల్లో మాత్రమే సదస్సులు జరగనున్నాయి. తహసీల్దార్ నేతృత్వంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్వోలు బృందంగా ఏర్పడి సదస్సుల్లో పాల్గొన్నారు. కొన్ని మండలాల్లో దేవదాయ, రిజిస్ట్రేషన్, అటవీ, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు కూడా సదస్సులకు హాజరయ్యారు. ఈ సదస్సులతో అయినా భూ సమస్యలకు చెక్ పడాలని బాధితులు ఎదురు చూస్తున్నారు. దాదాపుగా నెలకుపైగా జరిగిన రెవెన్యూ సదస్సుల్లో పెద్దసంఖ్యలో మ్యుటేషన్‌కు సంబంధించి వివాదేలా ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి వస్తున్న భూవివాదాలకు సంబంధించిన సమస్యలపై ఆయా సదస్సుల్లో బాధితులు బారులు తీరారు. రికార్డుల్లో ఉండాల్సిన భూమి కంటే తక్కువ విస్తీర్ణం ఉందని పలువురు నివేదించగా ఇలాంటి ఫిర్యాదుల విషయంలో ఉన్నతస్థాయిలో సర్వే నిర్వహించి తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ముందుగా ఇరుపార్టీలకు నోటీసులు జారీ చేయడంతో పాటు సిబ్బంది విచారణ చేపడతారని తర్వాతే వీటి విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుందని యంత్రాంగం చెబుతోంది. 20 శాతం పైగా దరఖాస్తుల్లో కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ, ఎఫ్‌లైన్ పిటిషన్లు వంటివి ఉన్నాయి. వాటిని సత్వరమే పరిష్కరించడానికి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో కూడా రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు అందాయి.

277 గ్రామాల్లో..

జిల్లా వ్యాప్తంగా 277 రెవెన్యూ గ్రామాలకు 262 గ్రామాల్లో సదస్సులు జరిగాయి. మిగిలిన 15 గ్రామాల పరిధిలో బుధవారం సదస్సులు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా ఇప్పటి వరకు వివిధ సమస్యలపై 5,837 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఇప్పటికే 3,317 పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. 2,520 అర్జీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. దాదాపు 600 ఫిర్యాదుల వరకు స్థానికంగా ఉండే వైసీపీ నేతాగణంతో పాటు ఆ సమయంలో అక్కడ పనిచేసిన రెవెన్యూ సిబ్బందిపైనే వచ్చినట్లు తెలుస్తోంది. ఇవన్నీ కూడా బలవంతపు భూ ఆక్రమణలేనని ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చినట్లు సమాచారం. దాదాపు 250 ఎకరాలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయనే ఫిర్యాదులు అందాయి. గత ప్రభుత్వంలో రేపల్లె నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నేతలు భూ ఆక్రమాల విషయంలో ఆకాశమే హద్దుగా చెలరేగిపోగా సదస్సుల్లో 1,386 ఫిర్యాదులు అధికారు లకు అందాయి. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గం ఇదే కావడంతో ఇక్కడ వచ్చిన పిటిషన్ల సంఖ్యతో పాటు వాటి పరిష్కారానికి తీసుకునే చర్యలపైనా అందరి దృష్టి కేంద్రీకృతమైంది.



రేపల్లె నియోజకవర్గ పరిధిలోని కారుమూరు గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు(ఫైల్ ఫొటో)

నేటి నుంచి క్రికెట్ సందడి

అంతర్ రాష్ట్ర పోటీలకు రావినూతల సిద్ధం

మేదరమెట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి క్రికెట్ పోటీలకు రావినూతల సిద్ధమైంది. బుధవారం నుంచి అంతర్ రాష్ట్ర పోటీలు ప్రారంభమవుతున్నాయి. టర్ఫ్ పిచ్‌పై జరిగే ఈ పోటీలను ఆర్ఎస్‌సీఏ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ప్రతి సంవత్సరం జరిగే సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలతో రావినూతలకు రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చింది. క్రికెట్ క్రీడపై ఉన్న అభిమానంతో ప్రారంభమైన టోర్నమెంట్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయిని దాటి అంతర్ రాష్ట్ర పోటీలు నిర్వహించే స్థాయికి ఎదిగింది. ఈ క్రమంలో సుమారు రూ.6 కోట్ల స్టేడియం రావినూతలకు ఆస్తిగా మిగిలింది. స్టేడియం పెవిలియన్, ప్రహరి నిర్మాణం, టర్ఫ్ పిచ్ ఏర్పాటుకు అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు, పూర్వ కార్యదర్శి దివంగత పుట్టా వెంకట్రావు, సభ్యులు ఎంతగానో కృషి చేశారు.

1991లో ఆర్ఎస్‌సీఏ ఏర్పాటు

1991లో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఆర్ఎస్‌సీఏ) ఏర్పాటైంది. ఆ సమయానికి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కూడా లేదు. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో ఎక్కడా టర్ఫ్ పిచ్ లేని సమయంలో రావినూతల స్టేడియంలో టర్ఫ్ పిచ్‌పై పోటీలు నిర్వహించారు.

సంక్రాంతికి అదనపు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు అదనంగా ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07205-కాకినాడ టౌన్ - వికారబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 9వ తేదీన రాత్రి 9 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు, 10వ తేదీన సాయంత్రం 5 గంటలకు వికారాబాద్ - శ్రీకాకుళం రోడ్డు (07207) రైలు బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయి. ఈ నెల 11న మధ్యాహ్నం 2.45గంటలకు శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి (07208) రైలు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు గమ్యస్థానం చేరుతుందని తెలిపారు.

హుబ్లీ వరకే షాలిమార్ - వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్

వారంలో నాలుగు రోజుల పాటు గుంటూరు మీదుగా ప్రయాణించే షాలిమార్ - వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్ (18047) రైలు ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు హుబ్లీ వరకే ప్రయాణించనుంది. ఈ విషయాన్ని సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు.

నడికుడి మార్గంలో రైళ్ల రాకపోకల్లో ఆలస్యం

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నడికుడి మార్గంలో మంగళవారం వేకువ జామున పలు రైళ్లు నాలుగైదు గంటల ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. సోమవారం అర్ధరాత్రి సమయంలో సికింద్రాబాద్ వైపు నుంచి వస్తున్న ఖాళీ గూడ్స్ రైలుకు సంబంధించిన ఒక బోగీ పొందుగల - నడికుడి సెక్షన్‌లో పట్టాలు తప్పడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. దీంతో రైళ్ల రాకపోకలపై ప్రభావం పడింది. గుంటూరు వైపు నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరిన రైలు నంబరు 17255 నరసపూర్-లింగంపల్లి, చెన్నై సెంట్రల్ - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్(12603)లను మార్గ మధ్యంలో నిలిపివేశారు. పట్టాలు తప్పిన భోగీని తిరిగి ట్రాక్ పైకి ఎక్కించి క్లియర్ చేసేందుకు దాదాపు మూడు గంటల సమయం పట్టింది. ఈ కారణంగా ఆ రెండు రైళ్లు సికింద్రాబాద్‌కు ఐదు గంటల ఆలస్యంగా చేరాయి. భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), తిరుపతి - లింగంపల్లి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ (12733)లను విజయవాడ నుంచి దారి మళ్లించడంతో అవి కూడా ఐదు గంటలకు పైగా ఆలస్యంగా సికింద్రాబాద్‌కు చేరాయి. రేపల్లె - వికారాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్ (17626) రెండున్నర గంటల ఆలస్యంగా, సికింద్రాబాద్ వైపు నుంచి గుంటూరుకు బయలుదేరిన కాచిగూడ-రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్ (17625) నాలుగున్నర గంటల ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరాయి. లింగంపల్లి - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ (17256) దాదాపుగా ఐదు గంటల ఆలస్యంగా గుంటూరుకు చేరుకుని ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లింది. నాగర్‌సోల్ - నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌ని సికింద్రాబాద్ నుంచే కాజీపేట మార్గంలోకి దారి మళ్లించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో రైళ్ల వేగాన్ని 30 కిలోమీటర్లకు నియంత్రిస్తూ రైల్వే శాఖ కాషన్ ఆర్డర్‌ని జారీ చేసింది. ఈ సంఘటనపై ఉన్నతస్థాయి విచారణని రైల్వే అధికారులు ప్రారంభించారు. గతంలోనూ విష్ణుపురం సమీపంలో ఇలాంటి సంఘటనే జరిగింది. ఈ నేపథ్యంలో నడికుడి - మిర్యాలగూడ - నల్గొండ మధ్యన ట్రాక్ పటిష్టతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విడదల రజినిపై కేసులో 'సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ)నిబంధనలు అనుసరించాలి'

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన చేపట్టిన మాజీ మంత్రి విడదల రజినీ, ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రజలకు అసౌకర్యం కలిగించారని పేర్కొంటూ నమోదు చేసిన కేసులో ఆమెపై సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ) ప్రకారం నడచుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్ చార్జీల విషయంలో నిరసన చేపట్టి, ట్రాఫిక్ అంతరాయం కలిగించడంతోపాటు ప్రజలకు అసౌకర్యం కలిగించారని పేర్కొంటూ చిలకలూరిపేటకి చెందిన పిల్లి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు రజినిపై చిలకలూరిపేట పట్టణ పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు వచ్చింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ స్పందిస్తూ పిటిషనర్‌కు సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ)కింద నోటీసులు ఇస్తామన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 567.00 అడుగులు ఉంది. ఇది 249.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8022 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,597 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 50,886 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 50,886 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 38.71 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం. బబిత తదితరులు

హెల్మెట్ ధరిస్తే సురక్షితంగా గమ్యస్థానానికి

- రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, పోలీసుల సూచన

తుళ్లూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం ద్వారా ద్విచక్రవాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎమ్ బబిత సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన ప్రాధాన్యతను వివరించడం కోసం మంగళవారం తుళ్ళూరు పోలీసులతో కలిసి హైకోర్టు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బబిత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పాట్రన్-ఇన్-చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరి సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినటు వివరించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడపటం మోటారు వాహన చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరమని తెలిపారు. ఇకపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి శిక్షలు కఠినంగా అమలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి జీ మాలతి మాట్లాడుతూ చాలామంది ద్విచక్రవాహన దారులు తమ హెల్మెట్‌ను వాహనంపై ఉంచి నడుపుతున్నారని, వాహనాల తనిఖీల సమయంలో కంగారులో హెల్మెట్ ధరించే క్రమంలో కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. తుళ్ళూరు డీఎస్పీ టీ మురళీకృష్ణ మాట్లాడుతూ రూ. 10 వేల విలువ చేసే సెల్ ఫోన్ కొనుగోలు చేస్తేనే దానికి స్క్రీన్ గార్డ్ వేస్తున్నారని, అంతకన్నా విలువైన ప్రాణాలు రక్షించుకోవడం కోసం కనీసం హెల్మెట్ ధరించడంలేదని అన్నారు. ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు. ఇక నుంచి శుభకార్యాలకు, పుట్టిన రోజు సంద ర్భంగా ఇతరులకు గిఫ్ట్‌గా హెల్మెట్ ఇవ్వడం చేస్తే అది అనేక మంది ప్రాణా లను రక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమం అనంతరం కొంతమంది హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వ ర్యంలో ఉచితంగా హెల్మెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డా హెచ్ అమర రంగేశ్వరరావు, తుళ్ళూరు ట్రాఫిక్ సీఐ బీ కోటేశ్వరరావు, అసిస్టెంట్ సెక్రెటరీ ఎన్ జెజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ, ఎన్ఐపీహెచ్ఎం అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య),జనవరి 7(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్ మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మంగళవారం ఈ విషయాన్ని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, జాయింట్ డైరక్టర్ డాక్టర్ విధు కేపీలతో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సం బంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఎన్ఈపీ 2020లో పొందుపరిచిన మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీస్ (ఎమ్ఈఆర్‌యూ) కాన్సెప్ట్‌ను, అకడమిక్ ప్రోగ్రామ్స్‌ను, కరిక్యులమ్ డిజైన్‌ను చేస్తామన్నారు. అంతేకాకుండా ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, ఫ్యాకల్టీ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్, పేటెంట్స్, ప్రాజెక్టులు, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చని అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవ గాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉంద న్నారు. అధ్యాపకులను, విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో శిక్షణ ఇవ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, డీన్స్ పాల్గొన్నారు.

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు

- దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో ఘటన
- రూ. 30 లక్షల విలువైన బంగారం, వెండి చోరీ



దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

దాచేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు జరుగుతున్నాయి. పండుగలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లే కుటుంబాలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దొంగతనాలతో లక్షల రూపాయల సొమ్ము కోల్పోయిన బాధితులు ఆవేదన చెందుతున్నారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, దాచేపల్లి మండలం దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో నివాసముంటున్న జీఎం శంకర నారాయణరెడ్డి కుటుంబసభ్యులు తమ స్వగ్రామం రాజమండ్రి వెళ్లారు. ఆ ఇంటికి దగ్గరలో నివాసముంటున్న మరో అధికారి వీర ప్రకాషరావు కూడా తన కుటుంబ సభ్యులతో షిర్డీ వెళ్లారు. ఈ విషయాన్ని పసిగట్టిన గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడి బీరువాలో దాచిన బంగారం, వెండి సామాన్లు అపహరించారు. శంకరనారాయణ రెడ్డి ఇంట్లో 190 గ్రాములు, వీర ప్రకాసరావు ఇంట్లో 170 గ్రాములు బంగారం చోరీ జరిగింది. ఆయా కుటుంబాల వారు తిరిగి ఇళ్లకు చేరుకున్న తర్వాత చోరీ జరిగినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాచేపల్లి ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా పాఠశాలలకు సెలవులు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో గృహాలకు తాళాలు వేసి తమ సొంత ఊళ్లకు వెళ్లే వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తగిన భద్రత తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని వివరించారు. గతంలో కూడా దుర్గా సిమెంట్స్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో లక్షల రూపాయల విలువైన బంగారం, నగదు దొంగతనం జరిగింది. ఇంత వరకు ఆయా చోరీలకు సంబంధించిన విషయాల్లో ఎటువంటి పురోగతి లేదని స్థానికులు, బాధితులు విమర్శిస్తున్నారు.

దారిదోపిడి కేసులో నిందితుల అరెస్టు



దారి దోపిడీ కేసులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు, సీఐ శ్రీనివాసరావు తదితరులు

బాపట్ల, జనవరి 07 (ఆంధ్రజ్యోతి) : దారిదోపిడి కేసులో నింది తులను అరెస్ట్ చేసినట్లు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వివరించారు. పట్టణంలోని ధనలక్ష్మీ రైస్ మిల్లు వద్ద లారీలో ఊక నింపుకుని దుగ్గిరాల కాఫీ ఫ్యాక్టరీకి వెళుతుండగా, బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద లారీని ఇద్దరు వ్యక్తులు బారికేడ్ అడ్డం పెట్టి ఆపారు. మరో ఇద్దరు వచ్చి లారీ డ్రైవర్ రావూరి వాసుతోపాటు ముగ్గురు కూలీలను కత్తులతో దాడి చేసి గాయపరిచి, వారి వద్ద ఉన్న రూ. 1500, సెల్‌ఫోన్‌లు దొంగిలించారు. దీంతో, రావూరి వాసు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం గాలించి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులలో పట్టణంలోని రైలుపేటకు చెందిన షేక్ మదార్, అంబేద్కర్ నగర్‌కు చెందిన చేగూడి ఆనందబాబు, రైలుపేటకు చెందిన మొహమ్మద్ ఇక్బాల్, శాంతినగర్‌కు చెందిన షేక్ బాషీద్‌లు ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. చెడు వ్యసనాలు అలవాటుపాడి సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలు చేయాలని వారు నిర్ణయించుకున్నట్లు చెప్పారు. రైళ్ళల్లో మొబైల్ ఫోన్‌లు దొంగతనం చేస్తుంటారని, వాటిని అమ్ముకొని జల్సాలు చేస్తుంటారని చెప్పారు. వీరిలో 1,2 వారిపై చీరాల, బాపట్ల, తెనాలి జీఆర్‌పీ పోలీసు స్టేషన్లలో, బాపట్లటౌన్, వేటపాలెం పోలీసుస్టేషన్, చీరాల 1వ పట్టణ పోలీసుస్టేషన్, పొన్నూరు టౌన్ పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నాయన్నారు. చోరీ చేసిన ఫోన్లను నిందితులు పట్టణంలోని మొబైల్‌షాపు వద్ద విక్రయించేదుకు వచ్చిన సమయంలో రూరల్ సీఐ కే శ్రీనివాసరావు, ఎస్సై ఎం.శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేసినటు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు వివరించారు.

ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి మృతి



మృతుడు సత్యనారాయణ

మాచవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మాచ వరంలో మంగళ వారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన అంబటి సత్యనారాయణ(40) పొలానికి నీరు పెట్టేందుకు వెళ్ళాడు. ప్రమాదవశాత్తు కాలు వలో పడి పోవటంతో నీటిలో మునిగి ఊపిరి ఆడక చని పోయి నట్టు తెలి పారు. అక్కడ ఉన్న వారు చూసి ఈ సమాచారాన్ని సత్య నారా యణ బంధువులకు చేరవేశారు. సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించే సరికే చనిపోయి ఉన్నాడు. ఎస్ఐ సతీష్ తన సిబ్బం దితో సంఘటనా స్థలానికి వెళ్లారు.

కాలువలో జారిపడి వ్యక్తి మృతి



గంజనబోయిన లింగయ్య (ఫైల్)

ఈపూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలోకి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన ఈపూరులో మంగళవారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఈపూరుకి చెందిన గంజనబోయిన లింగయ్య (55) అంగలూరు మేజర్ కాలువలో నీటిని తీసుకునేందుకు యత్నిస్తుండగా కాలు జారి నీటిలో పడ్డాడు. నీటి ఉధృతికి కొద్ది దూరం కొట్టుకుపోయాడు. కాలు వలో ఆయన మృత దేహాన్ని గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



ప్రసంగిస్తున్న మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

షెడ్యూలు కులాల అభ్యున్నతికి కృషి చేయాలి

తాడేపల్లి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): షెడ్యూలు కులాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు.ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు కులాల సహకార, ఆర్థిక సంస్థ లిమిటెడ్ ఎండీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. డైరెక్టర్లు కూడా చిత్తశుద్ధితో తమ విధులు నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ పాల్గొన్నారు.



యువజనోత్సవాలకు ఎంపికైన విద్యార్థులతో వర్సిటీ అధికారులు

జాతీయ యువజన ఉత్సవాలకు ఏఎన్‌యూ విద్యార్థులు

పెదకాకాని, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లోని విద్యార్థులు మార్చి 5వ తేదీన నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో జరిగే జాతీయ యువజన ఉత్సవ పోటీలలో పాల్గొననున్నట్లు వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. గంగాధరరావు తెలిపారు. గత ఏడాది డిసెంబరు 26 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన సౌత్ జోన్ యువజన ఉత్సవాల పోటీలలో విశ్వవిద్యాలయ విద్యార్థులు ఆరు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు విజేతలను వీసి అభినందించారు. సౌత్ జోన్ స్థాయిలో వర్సిటీ పేరు ప్రతిష్ఠలను పెంచిన విద్యార్థులు, జాతీయ స్థాయిలో కూడా ఇనుమడింపజేయాలని కోరారు. ఈ సందర్భంగా యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్, డాక్టర్ రమీ బేగంలను అభినందించారు. యువజన ఉత్సవాలలో వర్సిటీ విద్యార్థులు స్పాట్ ఫోటోగ్రఫీ, మెహందీ, మైమ్, ఇన్ స్టాలేషన్, కార్టూనింగ్ విభాగాల్లో పతకాలు సాధించినట్లు యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కే. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం అందజేశారు.

ఆప్కో చేనేత వస్త్రములపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు

గుంటూరు సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని రకాల చేనేత వస్త్రములపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు ఇవ్వనున్నట్లు ఆప్కో వాణిజ్య అధికారి డీ వెంకటేశ్వర్లు తెలిపారు. చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పి ంచేందుకు, అధిక విక్రయాల కోసం ఆప్కో వస్త్రాలపై తగ్గింపును ప్రకటించి నట్లు తెలిపారు. మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి మంగళ గిరి చేనేత చీరలు, బెడ్షీట్స్, లుంగీస్, టవల్స్ రెడీమేడ్ వస్త్రములు అందుబాటులో ఉంటాయని అన్నారు. అన్ని ఆప్కో విక్రయశాలలతో పాటు, ఆప్కో హ్యాండ్లూమ్స్. కామ్ అమెజాన్, ఫ్లిప్కార్డ్ వంటి ఆన్‌లైన్ సంస్థలలో వస్త్రాలు కొను గోలు చేయవచ్చునని తెలిపారు.

రూ. 60 లక్షలు ఇవ్వని వారిపై చీటింగ్ కేసు

ప్రత్తిపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకుని ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న వారిపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాతమల్లాయపాలెంకి చెందిన సూరగాని గోపిరెడ్డికి గుంటూరుకు చెందిన గాలం శ్రీనివాసరావు, గాలం కార్తీక్, గాలం రేవతిలతో గత ఏడు సంవత్సరాలుగా పరిచయం ఉంది. ఈ క్రమంలో వ్యాపారం నిమిత్తం 2022 నుంచి వివిధ దఫాలుగా గోపిరెడ్డి వద్ద నుంచి రూ. 60 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే, ఈ సొమ్మును గోపిరెడ్డి తన బంధువుల వద్ద నుంచి తీసుకుని వారికి ఇచ్చారు. కొంత కాలంగా తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని అడుగుతుండగా వారు తప్పించుకు తిరుగుతున్నారు. గోపిరెడ్డి అప్పుతీసుకున్న వారి నుంచి ఒత్తిడి రావడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు తన వద్ద అప్పు తీసుకున్న ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

రేపు గుంటూరులో ఏపీ సీపీడీపీఎల్ సీఎండీ పర్యటన

- సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ పటాన్‌శెట్టి రవి ఈ నెల 9న గుంటూరు పర్యటనకు రానున్నారు. ఈ మేరకు విజయవాడలోని సీఎండీ కార్యాలయ అధికారులు గుంటూరు సర్కిల్ కార్యాలయ అధికారులకు సమాచారం అందించారు. విజయవాడ కేంద్ర కార్యాలయం నుంచి సీఎండీ నేరుగా గుంటూరులోని సంగడిగుంటలో ఉన్న విద్యుత్ భవన్‌కు చేరుకోనున్నారు. గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ కేవీఎల్ ఎన్‌మూర్తితో కలిసి సీఎండీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించ నున్నారు. విభజిత గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్ అధికారులతో సమీక్షించ న్నారు. రెవెన్యూ వసూళ్ళ పనుల పురోగతి,ప్రధానమంత్రి సూర్యఘర్ వంటి అంశాలను కూడా సమీక్షించనున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

72,819 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 76, 310 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 72,819 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్య దర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 55,385 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	8000	13500
నంబరు. 5	10000	14000	నంబరు. 5	8000	13000
273	9000	11500	273	-	-
341	7500	14500	341	12000	12000
4884	9000	11500	4884	-	-
సూపర్ 10	10500	10500	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7200	16500	తేజ	7500	15500
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	8000	12000
దేవనూరుడీలక్స్	9000	14500	దేవనూరుడీలక్స్	9500	9500
తెల్లకాయలు	4000	11500	తెల్లకాయలు	4000	9000

రేపు మూడు దేవాలయాల్లో హుండీల లెక్కింపు

పిట్టలవానిపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారు, శ్రీలింగోద్భవస్వామి దేవస్థానం, శ్రీచెన్నకేశవస్వామి దేవాలయాలలో గురువారం ఉదయం 10 గంటలకు భక్తులు సమర్పించిన హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. గుంటూరు జిల్లా దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలమేరకు బాపట్ల సబ్ డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖాధికారులు, రెవెన్యూ డిపార్టమెంట్, చందోలు గ్రామపంచాయతీ అధికారులు, చందోలు పోలీసు డిపార్ట్‌మెంట్, సంబంధిత శాఖాధికారులు పాల్గొంటారన్నారు.

విద్యాబోధన సమగ్రంగా ఉండాలి

పిట్టలవానిపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కోడూరు గ్రామ పంచాయతీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను మంగళవారం మండల విద్యాశాఖాధికారి-2 కె.రాజారత్నం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు గురించి విద్యార్థులచే చదివించి విద్యార్థుల పురోగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజన పథకాన్ని సమయపాలన పాటించి వారికి అందజేయాలని తెలియజేశారు. పాఠశాలలోని మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఎండిఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

బీసీ, ఈడబ్ల్యూఎస్ రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బీసీ కులాలు, ఈడబ్ల్యూఎస్ కులాలకు రాయితీ రుణాలు అందిస్తున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు మంగళవారం తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీలకు 15 రుణాలు కేటాయించారు. ఈడబ్ల్యూఎస్ కులాలు అనగా రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాల లబ్ధిదారులకు 8, జనరిక్ మెడికల్ కింద మరో రెండు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయా రుణాలకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల్లో ఉన్న లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

కర్లపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డి కులస్థులు, ఆర్యవైశ్యులు, బీసీ-ఎ, బీ, డీ, ఈ కులస్థులు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రెడ్డి కులస్థులకు, ఆర్యవైశ్యులకు 10 యూనిట్‌లకు సంబంధించి 23 లక్షల 50 వేల రుణం, బీసీ-ఎ, బీ, డీ, ఈ కులస్థులకు 24 యూనిట్‌లు 43 లక్షలు, జనరిక్-1కు రూ.8 లక్షలు రుణాల కొరకు ఈనెల 8 నుంచి 16వ తేదీలోపు ఆయా గ్రామసచివాలయాలలో ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని లబ్ధిదారులకు ఎంపీడీవో తెలిపారు.

12న మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు 16వ వార్డు సభ్యులు కౌతరపు శ్రీనివాసరావు తెలిపారు. పద్మశాలీయ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతకు రూ.3 వేలు విలువ కలిగిన బహుమతి, ద్వితీయ స్థానం, రూ.2 వేలు, తృతీయ స్థానం, రూ.వెయ్యి అందజేయనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే మహిళలు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలి : సీపీఎం

బాపట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై భారం మోపే ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమిషన్ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బాపట్ల విద్యుత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గంగయ్య పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయటం, ప్రైవేట్ కంపెనీలకు అప్పగించటం వల్ల వినియోగదారులు, రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి ధనుర్మాస పూజలు

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని ఐలవరం వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామికి ఆలయ ధర్మకర్త మార్కండేయబాబు సహకారంతో ఆకు పూజ కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమరసత నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పూజాది కార్యక్రమాలను ఆలయ అర్చకులు దీవి రఘునాథచక్రవర్తి నిర్వహించారు. కార్యక్రమంలో కొసనం భాస్కర వెంకటరమణ, వామనపల్లి కోటేశ్వరరావు, జొన్నాదుల ఉమామహేశ్వరరావు, శివసూర్యవతి, జంజనం హేమశంకరరావు పాల్గొన్నారు.

నేడు వేమన శతక పద్య పోటీలు

చుండూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మోదుకూరులోని వేమన జయంతి ఉత్సవ కమిటీ, విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ లయోలా కళాశాలలో వేమన జయంతి 2025 సందర్భంగా వేమన శతక పద్య పోటీలు నిర్వహిస్తున్నట్లు విజయవాడ లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ పోటీలలో మొదటి మూడు స్థానాలు పొందిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందించడం జరుగుతుందన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధి పనులకు పెద్ద సంఖ్యలో ప్రతిపాదనలు చేసినట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నూతన సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళిక గురించి ఆయన వివరించారు. అన్నిశాఖల అధికారులతో సమావేశమై ఆయా శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు తయారు చేసి పంపించటం జరిగిందన్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో కొత్తపాలసీ రానుందని, వచ్చిన తర్వాత ముందుకు వెళ్లాలని వ్యాపారులకు సూచించారు. బాపట్ల ప్రాంతం అభివృద్ధి కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముందుకు రావాలన్నారు. వారికి ఏ సమస్య వచ్చిన భరోసాగా ఉంటామన్నారు. బాపట్ల మున్సిపాలిటి, మండలాలలో ప్రభుత్వ అసైన్డ్‌భూములు అధికంగా ఉన్నాయని వాటిల్లో అనేకం ఆక్రమించినట్లు తెలిసిందన్నారు. కొంతమంది వ్యాపారులు ప్రభుత్వ భూములలో రోడ్లు వేసి రియల్ ఎస్టేట్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. వీటిని పరిశీలించి తగినవిధంగా స్పందిస్తామన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. అభివృద్ధి దిశగా ముందుకెళ్ళాలే తప్ప ప్రభుత్వ భూములు ఆక్రమించరాదని చెప్పారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

త్వరలో మున్సిపల్ ఎన్నికలు

వైసీపీ పాలనలో నిలిచిపోయిన బాపట్ల పురపాలక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నరేంద్రవర్మ తెలిపారు. మున్సిపాలిటిలో ఏయే ప్రాంతాలు కలపాలి అనే దానిపై పరిశీలించి నిర్ణయం తీసుకోవటం జరుగుతుందన్నారు. ఎన్నికలు జరిగితే నిలిచిపోయిన నిధులు కూడా పురపాలక సంఘానికి వస్తాయన్నారు. ఎన్నికలు జరగక 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్నారు. ఎన్నికలు జరిగితే వస్తాయన్నారు.

టీచర్స్ కాలనీలో వందల్లో అక్రమ కట్టడాలు

పట్టణంలోని 11వ వార్డు టీచర్స్ కాలనీలో వందల్లో అక్రమ కట్టడాలు నిర్మించినట్లు తెలిసిందన్నారు. అసైన్డ్ భూములు కావున నిర్మాణాల విషయంలో పరిశీలించి పట్టాలిచ్చి రెగ్యూలర్ చేస్తే బాగుంటుందనే అభిప్రాయం ఉందన్నారు. దీనిపై త్వరలో స్పష్టత వస్తుదని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతుందన్నారు. వీలైనంత తొందరగా భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలిగించాలని కమిషనర్‌కు తెలియజేశామన్నారు.

300 పడకల ఆసుపత్రిగా ప్రతిపాదనలు

బాపట్లలోని 100 పడకల ఏరియా వైద్యశాలను 300 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని పాతభవనాలు తొలిగించి కొత్తవి నిర్మించి అభివృద్ధి చేస్తామన్నారు. ఏరియావైద్యశాల ప్రాంగణంలోని సైకిల్ స్టాండ్ ఖాళీ చేసేందుకు ఏర్పాట్లు జరిగాయన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలోని మున్సిపల్ కమిషనర్ బంగ్లా స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి పై అంతస్థులో అతిథిగృహాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఎంపీతో విభేదాలు లేవు

బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో తనకు విభేదాలు ఉన్నాయనే ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ప్రతి చిన్న విషయంలో తాము కలిసి చర్చించుకున్న తర్వాత ముందుకెళుతున్నామన్నారు. ఐపీఎస్ అధికారిగా పని చేసిన ఎంపీ 7 నియోజకవర్గాల సమస్యల పరిష్కారం కోసం బాపట్లలో కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారన్నారు. దీనిని రాజకీయం చేయటం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇద్దరం కలిసి నిధులు తీసుకురావటానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులుగా ఇద్దరం కలిసి ప్రజలకు మేలు చేసే పనులు చేస్తున్నామన్నారు. త్వరలో ఆలయాల అభివృద్ధి పనులు పూర్తి చేయటం జరుగుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, సర్పంచ్‌లు

మండల పరిషత్ సమావేశానికి ఎంపీటీసీలు డుమ్మా

● సమావేశం నేటికి వాయిదా

కర్లపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన జరగాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీటీసీలు గైర్హాజరవ్వటంతో బుధవారానికి వాయిదా పడింది. సమావేశం నిర్వహించేందుకు ఎంపీపీ యారం వనజ, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ సుందరమ్మ, సూపరింటెండెంట్ రజనీ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు సమాయత్తమై సర్వసభ్య సమావేశ మందిరంలో ఆశీనులవ్వగా పంచాయతీ సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు మాత్రమే పాల్గొనగా ఎంపీటీసీలు అందరూ గైర్హాజరవటంతో ఎంపీడీవో శ్రీనివాసరావు సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నానికి వాయిదా వేసినట్లు ప్రకటించారు. మండల పరిషత్‌లో ఉన్న నిధులను సమావేశంలో తెలియపర్చటం, అవసరాలను చర్చించటం, ఆయా సెగ్మెంట్‌లకు నిధులు కేటాయించకుండా మొక్కుబడి సమావేశాలకు రావాల్సిన అవసరం ఏముందని ఎంపీటీసీలు ప్రశ్నిస్తున్నారు. కర్లపాలెం మండల పరిషత్‌లో గతంలో ఎంపీటీసీలు చేసిన 15 పనులకు గాను రూ.30 లక్షల నిధులు చెల్లించలేదని, ఏవో కుంటిసాకులు చూపుతున్నారని ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీనివాసరావును వివరణ కోరగా ఎంపీటీసీలందరూ సమావేశానికి హాజరై ఆయా గ్రామాలలో అవసరమైన పనులను తెలియపర్చాలని, ప్రాధాన్యతను బట్టి ఆయా గ్రామాలలో ముఖ్య అవసరాలకు ఎంపీటీసీలకు నిధులు కేటాయిస్తామన్నారు. మండల పరిషత్‌లో జనరల్ ఫండ్ రూ.40 లక్షలు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.30 లక్షలు ఉన్నాయన్నారు.

డ్వాక్రా మహిళలకు ముత్యాల ముగ్గుల పోటీలు

బాపట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం డ్వాక్రా మహిళలకు, మున్సిపల్ మహిళా ఉద్యోగులకు ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేసి రంగులు దిద్దారు. అత్యంత ఆహ్లాదకరంగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజెప్పేవిధంగా వేసిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీలలో నాయుడు శివపార్వతి మొదటి బహుమతి, కాకర్ల రాజేశ్వరి ద్వితీయ బహుమతి, ఇళ్ళ అపర్ణ తృతీయ స్థానంలో గెలుపొందారు. వీరికి కమిషనర్ జి.రఘునాథరెడ్డి బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, మేనేజర్ పి.లక్ష్మయ్య, సీవోలు, నవక్రాంత్, విజయలక్ష్మి, మీరాకుమారి, పట్టణ సమైక్యాధ్యక్షురాలు అక్కల నాగవరలక్ష్మి, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలు దిద్దిన ముగ్గులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి

క్యాలెండర్ ఆవిష్కరించిన అఖిలేష్‌యాదవ్



అఖిలేష్‌యాదవ్‌తో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేదా శ్రీనివాసరావు

బాపట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు బాపట్ల నాయకులతో కలిసి లక్నో వెళ్ళి సమాజ్‌వాదిపార్టీ సెంట్రల్ ఆఫీస్‌లో మాజీ ముఖ్యమంత్రి, ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు అఖిలేష్‌యాదవ్‌తో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా అఖిలేష్‌యాదవ్ ఆయనను అభినందించి పార్టీశ్రేణులకు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తానని బాపట్ల జిల్లా పర్యటనకు వస్తానని అఖిలేష్‌యాదవ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్లనాయకులు యల్లావుల సోహిత్, వడ్లమూడి వెంకటబాస్కరరావు తదితరులు ఉన్నారు.

పాపారావుకు గొట్టిపాటి అభినందనలు

కర్లపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు బాపట్లకు విచ్చేసిన సందర్భంగా కర్లపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. మండలంలో జనసేన పార్టీని అభివృద్ధి పథంలో నడిపించాలని, కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నింటిని ప్రజలకు చేరవేసే విధంగా పూర్తి స్థాయిలో పని చేయాలని శ్రీకృష్ణకు పాపారావుసూచించారు.

బుద్దాంలో మద్యం స్వాధీనం

కర్లపాలెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుద్దాం గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న నర్రా శివ నాగరాజును అదుపులోకి తీసుకొని 10 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కర్లపాలెం ఇన్‌చార్జి ఎస్సై స్వామి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మద్యం బాటిళ్ళను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైటర్ నరేష్, బాలాజి ఉన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు పురస్కారాలు

కొల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభ గల విద్యార్థులకు డాక్టర్ చౌదరి కొమ్మినేని ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పురస్కారాలను ప్రదానం చేశారు. కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో ఐ.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ట్రస్ట్ ద్వారా ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి నగదు పురస్కారాలు అందించేందుకు డాక్టర్ చౌదరి కొమ్మినేని నిధులు కేటాయించడం, ఆయా నిధులను వారి సోదరి గుత్తా రాజ్యలక్ష్మి వినియోగించడం అభినందనీయమన్నారు. విద్యార్థినులకు ప్రతిభ పురస్కారాలను గుమ్మడి జనార్ధనరావు, నన్నపనేని సత్యవతి, రాజ్యలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వి.జ్యోతి, హెచ్‌ఎంలు చావా ఉషాకుమారి, కె.నాగపాప, రిటైర్డ్ హెచ్‌ఎం వాసుదేవరావు, రిటైర్డ్ జడ్జి నాగళ్ల నరహరి, ఎస్‌ఎంసి ఛైర్మన్ జి.లక్ష్మీకాంతం, క్రాప వీరబ్రహ్మాచారి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తున్న రాజ్యలక్ష్మి తదితరులు

ఉపాధ్యాయుల బదిలీలపై ప్రభుత్వ ప్రకటన అసంబద్ధం

● ఆపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసకుమార్

వేమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ప్రభుత్వం కొత్త ఆలోచనతో పని తీరుకు పాయింట్లు కేటాయిస్తూ దాని ఆధారంగా బదిలీ చేయడం జరుగుతుందని ప్రకటించడం అసంబద్ధంగా ఉందని బాపట్ల జిల్లా ఆపస్ అధ్యక్షుడు శ్రీనివాసకుమార్ అన్నారు. వేమూరులో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వ్యాయామ ఉపాధ్యాయులకు విద్యార్థులను క్రీడా పోటీలలో రాష్ట్ర స్థాయికి పంపిన వారికి మాత్రమే పాయింట్లు ఇస్తున్నట్లుగా పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి క్రీడలలో సెక్షన్ ఇచ్చి విద్యార్థులను మంచి స్థాయికి తీసుకువచ్చిన వాళ్లకు పాయింట్లు రావడం లేదన్నారు. సోషల్ టీచర్స్‌కి సిలబస్ చాలా ఎక్కువగా ఉంది. రాష్ట్ర, జాతీయ స్థాయి క్విజ్, జికె పోటీలు జరగడం తక్కువగా ఉంది. తెలుగు ఉపాధ్యాయులకు దేనిని ప్రామాణికంగా తీసుకుంటారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి సమస్యలన్నింటిని కూడా దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయ సంఘాల సలహాలు కూడా తీసుకుని ప్రభుత్వం తుది నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు రవిరాజు, సత్యనారాయణ, పోతురాజు, పార్థసారధి పాల్గొన్నారు.

ఈపూరులో పొలం పిలుస్తోంది

కొల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మంగళవారం నిర్వహించారు. మండల పరిధిలోని ఈపూరులో జొన్న, మొక్కజొన్న పంటల పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రబీలో వేసిన పంటల రైతులు వంద శాతం పంట నమోదు చేయించుకోవాలన్నారు. దీని వల్ల జొన్న, మొక్కజొన్న పంటలను కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయం చేసే అవకాశం కలుగుతుందన్నారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిరోజు కొల్లూరు సొసైటీకి 40 నుంచి 60 టన్నులు యూరియా సరఫరా అవుతుందని, మనగ్రోమోర్ సెంటర్‌లో 300 టన్నుల యూరియా అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు కార్యాచరణ

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యత నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ రూపొందించినట్లు ఎంపీపీ డి.లలితకుమారి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ వలంటీర్లకు కనీస విద్య, డిజిటల్ లిటరసి, ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించే నిమిత్తం మూడు రకాల పుస్తకాలను ఎంపీపీతో పాటు ఎంఈవో ఎస్.దేవరాజు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీమన్నారాయణ, సీసీలు హనోకు, రజనికుమారి, నరేంద్ర, యానిమేటర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లా కార్యవర్గం ఎన్నిక

రేపల్లె, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీనియర్ న్యాయవాది దారం సాంబశివరావు తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో మంగళవారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లా సమావేశంలో అధ్యక్షుడిగా ఎస్టీఎం రబ్బాని, ప్రధాన కార్యదర్శిగా పి.నాగాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా గురిందపల్లి రామారావు, కార్యదర్శిగా మోర్ల కృష్ణారావు, సహాయ కార్యదర్శిగా ప్రతాప్, గౌరవాధ్యక్షులుగా పి.భూషణంతో పాటు మరో నలుగురిని సభ్యులుగా ఎన్నుకోవటం జరిగిందని తెలిపారు.

ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

● విద్యార్థులు, టీచర్‌కు స్వల్ప గాయాలు



పాక్షికంగా దెబ్బతిన్న స్కూల్ బస్సు, లారీ

కొల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన స్కూల్ బస్సును లారీ ఢీకొన్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కొల్లూరు శివారు బోసునగర్ వద్ద విద్యార్థులను ఎక్కించుకుంటున్న బస్సును తెనాలి నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న విద్యార్థులు, మహిళ టీచర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు, లారీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విద్యా సంస్థ డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు ప్రమాద ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామానికి చెందిన షేక్ జాన్‌బీ ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతూ శస్త్ర చికిత్స నిమిత్తంగా కావాల్సిన ఆర్థిక సాయం ప్రభుత్వం ద్వారా అందించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు లేఖ రాశారు. స్పందించిన ఆనందబాబు ముఖ్యమంత్రి సహాయ నిధి విడుదల కోసం సిఫార్సు చేశారు. తద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి జాన్‌బీకి రూ.3,69,799 మంజూరు అయ్యాయి. సంబంధిత ఎల్‌వోసిని మంగళవారం జాన్‌బీ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా జాన్‌బీ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



వైద్యాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రతినెల తప్పనిసరిగా పరిశీలించి విద్యార్థులకు వైద్యాధికారులు వైద్యపరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వైద్యాధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ తప్పనిసరిగా ప్రతి మెడికల్ ఆఫీసర్ ప్రతినెల విజిట్ చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి రెండురోజులకు ఒకసారి విజిట్ చేయాలన్నారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేవిధగా మున్సిపాలిటీవారు చూసుకోవాలని 104 వాహనం వెళ్ళినప్పుడు తమ పరిధిలో ఉన్న హాస్టల్ తప్పనిసరిగా చూడాలన్నారు. విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. మహిళా పోలీసులు హాస్టళ్ళను పర్యవేక్షించవల్సిందిగా ఆదేశించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ అన్ని రకాల ప్రోగ్రామ్స్ మీద సమీక్షించారు. హెచ్‌ఎంపీవీ కేసుల మీద ప్రజలకు అవగాహన కల్పించాలని చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలను పాటించాలన్నారు. సమావేశంలో జిల్లాలోని వైద్యాధికారులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీ కేసుల సన్నద్ధంపై సమావేశం

బాపట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కమిషన్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ వారు మంగళవారం హెచ్‌ఎంపీవీ కేసుల సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ సమావేశంలో పాల్గొని కేసులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పలు సూచనలు చేశారు. ఏపీలో ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. చిన్నపిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జలుబు, జ్వరంతో బాధపడే వారిని గుర్తించి వెంటనే చికిత్స ఇవ్వాలని, అత్యవసరమైతే హయ్యర్ సెంటర్‌లకు పంపించాలని చెప్పారు. అస్థమా, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి హాస్పటల్‌లో చిన్న పిల్లల వార్డులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలిచ్చారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు

రేపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల భూహక్కుల సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు అని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కారుమూరు, అరవపల్లి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని కొంతమంది రైతులు అడంగల్‌లో తప్పులు పడ్డాయని, రికార్డుల ప్రకారం చూసుకుంటే భూమి తక్కువ చూపెడుతున్నాయని, ఆక్వా రొయ్యల చెరువుల సమస్యలు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నింటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

పోతుమర్రు గ్రామంలో...



సభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుశీల

వేమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రారంభించిన గ్రామ రెవెన్యూ సభల ద్వారా సంబంధించిన దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికి దోహదపడటం జరిగిందని తహసీల్దార్ సుశీల అన్నారు. మండలంలోని పులిచింతలపాలెం, పోతుమర్రు గ్రామాలకు చెందిన గ్రామసభను మంగళవారం పోతుమర్రులో నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, మండలంలోని 14 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభలకు రైతుల నుండి 197 భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు అందినట్లు తెలిపారు. వాటిలో 106 సమస్యలకు వెంటనే పరిష్కారం చూపడం జరిగిందన్నారు. 91 అర్జీలను పరిశీలనలో ఉంచామని వాటినికూడా త్వరలో పరిష్కరిస్తామని ప్రకటించారు. గ్రామ సభలో డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయి, సర్పంచ్ షైనా, విఆర్వో కనకమ్మ, సచివాలయ సిబ్బంది ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బొద్దులూరుపాడులో..



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

కొల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నెల రోజులుగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగిశాయి. మండల పరిధిలోని బొద్దులూరుపాడులో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడుతూ రైతులు అందించిన అర్జీలను స్వీకరించి ఆయా సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఇప్పటివరకు జరిగిన సదస్సులో మొత్తం 171 అర్జీలు రైతుల నుంచి అందినట్లు తహసీల్దార్ తెలిపారు. రైతుల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, ఎండోమెంట్ ఈవో ఎస్.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ హర్షవర్ధన్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థులకు అవగాహన

చెరుకుపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజోలు హైస్కూల్ విద్యార్థులకు సైబర్‌క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ వినియోగం, ఈవ్‌టీజింగ్‌పై ఎస్‌ఐ టి.అనిల్‌కుమార్ మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఈవ్‌టీజింగ్ లాంటివి ఏవైనా జరిగితే తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పందెం కోళ్లకు భలే గిరాకీ!

రసంగి



కోడిపుంజులకు శిక్షణ ఇస్తున్న శిక్షకులు



సంక్రాంతి పండుగ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ.. పందేలకు కోళ్లను సన్నద్ధం చేస్తున్నారు పందెంరాయుళ్లు. ఇందుకోసం వివిధ రకాల పుంజులను సిద్ధం చేసుకుంటున్నారు. పండుగకు అయిదు నెలల ముందు నుంచే అన్ని జాతుల కోడిపుంజులను తీసుకువచ్చి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి కోడి పుంజులకు బలవర్ధక ఆహారమైన డ్రై ఫ్రూట్స్ తినిపిస్తూ పెంచుతున్నారు. అలాగే ఆయా పుంజులు బరిలో అన్నివిధాలా తట్టుకొని నిలిచి గెలవడం కోసం బలవర్ధకమైన ఆహారంతోపాటు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. దీంతో పందెం రాయుళ్లు సిద్ధమైన కోళ్లను రూ. లక్షలు పెట్టి కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- సంక్రాంతి బరికి సిద్ధం చేస్తున్న నిర్వాహకులు
- డ్రై ఫ్రూట్స్‌తో ప్రత్యేక ఆహారం, శిక్షణ
- కుక్కుటి శాస్త్రం ద్వారా గెలుపోటములు
- లక్షలు పలుకుతున్న కోడి పుంజులు

రేపల్లె, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో నిర్వాహకులు పందె కోళ్లను సన్నద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో పుంజు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. తీర ప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో కొన్ని సంవత్సరాలుగా కోడిపందాలు నిర్వహిస్తున్నారు. ఈ పందాలకు తెలంగాణా రాష్ట్రం నుంచి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి పందెం రాయుళ్ళ తరలి వస్తారు. రానున్న సంక్రాంతికి చెరుకుపల్లిమండలం పూషడపువారిపాలెం, నగరం, రేపల్లె మండలం గుడ్డికాయలంకలో కోడిపందాలు వేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో వారం రోజులుగా తర్ఫీదులో భాగంగా పుంజులకు పందేలు నిర్వహిస్తున్నారు. అలాగే వాటిని సంక్రాంతి బరిలో నిలిపేందుకు గట్టి శిక్షణను ఇస్తున్నారు.



ప్రత్యేక ఆహారం, వ్యాయామం

నిత్యం ముగ్గురు శిక్షకులు పందెపు కోళ్ళ సంరక్షణ చూస్తుంటారు. ఉదయాన్నే 5 గంటల కల్లా కోడి పుంజులను బయటకు తీసి కాసేపు చల్లటి పైరు గాలి శ్వాస తీసుకునేలా చేసి అనంతరం చుట్టూ వలయంగా ఏర్పాటు చేసి కోడి పుంజులను దాంట్లోకి వదిలి పరుగెత్తిస్తారు. వాటికి పేరుకుపోయిన కళ్ళను బయటకు తీసి స్విమ్మింగ్ చేయిస్తారు. పుంజులు అలసిపోవటంతో పాలల్లో నానబెట్టిన బాదం పప్పు, పిస్తా పప్పు, ఖర్జూర, కిస్‌మిస్‌లను కోళ్ళకు పెట్టి సిరంజి ద్వారా పాలను పట్టిస్తారు. ఒక్కో పుంజుకు రోజుకు వంద నుండి రూ.700 వరకు ఖర్చు చేసి మానవుడి కంటే అతి సున్నితంగా పందెపు కోళ్ళను తయారు చేయటంలో వారు తీసుకునే జాగ్రత్తలు చూస్తే ఆశ్చర్యం చెందాల్సిందే. నిత్యం కోళ్లకు బలమైన ఆహారంతో పాటు వ్యాయామం చేయించి సంక్రాంతి పండుగ ఎప్పుడు వస్తుందా, కోడి పందాలు ఎప్పుడు వేద్దామా అనే రీతిలో పుంజులను తయారు చేస్తారు.

కోడి పుంజుల్లోని రకాలు..

కోడి పుంజుల్లో తెల్ల నెమలి, కోడి నెమలి, గౌడ నెమలి, కాకి డేగ, నెమలి కక్కెర, నల్ల కక్కెర, రసంగి, గాజు కక్కురాయి, అబ్రాస్, ఎర్రడేగ వంటి జాతులు వుంటాయి. వీటిల్లో తెల్ల నెమలి, గౌడ నెమలి, రసంగి, అబ్రాస్ పుంజులు ఎంతటి పందానైన్నా సులువుగా నెగ్గుతాయి. పందానికి తయారయ్యే పుంజులకు రూ.50 వేల నుంచి లక్షరూపాయలకుపైనే ఖర్చు చేస్తారు. వీటికి బలమైన ఆహారంతోపాటు ప్రత్యేక శిక్షకుడిని పెట్టి శిక్షణ నివ్వటంతోపాటు పందెం కోడి తయారయ్యేలా చేస్తారు. ఈ కోళ్ళన్నీ పూర్తిస్థాయిలో పందానికి సిద్ధమైతే లక్ష రూపాయలు పైనే పలుకుతుందని శిక్షకులు చెబుతున్నారు.

కోడి పందాలకు కుక్కుటి శాస్త్రం..

కోడి పందాల్లో ప్రావీణ్యం వున్న వారు కుక్కుటి శాస్త్రాన్ని అనుసరిస్తారు. పందెం వేసే రోజున నక్షత్రాన్ని బట్టి తారాబలం చూసి కోడి రంగు, జాతిని ఎంపిక చేసి ఆరోజున ఏ పుంజుతో పందెం వేయాలో ఆ రంగు వున్న కోడి పుంజుతోనే పందాలు వేయటం జరుగుతుంది. 13వ తేదీ భోగి సందర్భంగా గౌడ నెమలి, నెమలికి చెందిన పుంజులు గెలుపొందుతాయని, 14వ తేదీ యాసర కాకిడేగలు, కాకి నెమలిలు, పసిమగల్ల కాకులు, కాకి డేగలకు చెందిన పుంజులు గెలుపొందుతాయి. 15వ తేదీ డేగలు, ఎర్రకాకి డేగలు గెలుపొందుతాయని కోడిపందాల్లో ప్రావీణ్యం వున్నవారు ఈ కుక్కుటి శాస్త్రం ఆధారంగా చెబుతున్నారు.

కాకి డేగ



నెమలి కక్కెర



నల్ల కక్కెర



గాజు కక్కెర



అబ్రాస్



ఎర్ర డేగ



కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో 196 మంది ఎంపిక



అభ్యర్థుల కొలతలు పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతోన్న కానిస్టేబుళ్ళ దేహదారుఢ్య పరీక్షల్లో బుధ వారం 196 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. 315 మంది హాజరవగా, వారిలో 50 మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 265 మందికి శరీరకొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 23 మంది ఛాతి, ఎత్తు తదితర కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరణకు గురయ్యారు మిగిలిన 242 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 28 మంది విఫలమయ్యారు. తదుపరి 214 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 133 మంది అర్హత సాధించగా 81 మంది విఫలమయ్యారు. కాగా 214 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 194 మంది అర్హత సాధించగా 20 మంది విఫలమయ్యారు. మొత్తం 265 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 196మంది అర్హత సాధించగా, 69మంది విఫలమ య్యారు. కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ప్రతి సందర్భంలోనూ స్వయంగా పరిశీలించి, పరీక్షల నిర్వహణ అధికారులకు, అభ్యర్థులకు ఎస్పీ పలు సూచనలు చేసారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు సుప్రజ , హనుమంతు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆ.. చేద్దాంలే

- సచివాలయల ఉద్యోగుల్లో పెరుగుతున్న నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆదేశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిని సెట్ సరి చేయకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందులు తలెత్తుతాయని కొందరు జిల్లా అధికారులు బహిరంగంగానే అంటున్నారు. కొందరు సచివాలయ ఉద్యోగుల్లో గత ప్రభుత్వంపై ఇప్పటికీ కృతజ్ఞత ధోరణి కనిపిస్తోందని అందువల్లే వారు ఇప్పటి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్నారని కొందరు అంటున్నారు. అందువల్లే ప్రభుత్వ ఆదేశాలను సక్రమంగా పాటించకపోవడం.. పనులపై నిర్లక్ష్యం చేస్తున్నారని తెలుస్తోంది.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హవా..

సచివాలయ ఉద్యోగుల పనితీరు, వివరాల సేకరణపై కూడా గుంటూరు జిల్లాలో వివాదం నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ మంత్రి దగ్గర ఉండి చాలా మంది జిల్లా అధికారులను సైతం దబాయించి మాట్లాడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సచివాలయ ఉద్యోగుల వ్యవహారాలు చూస్తున్నారు. జిల్లాలోని మొత్తం సచివాలయ సిబ్బంది ఆయన ఆధ్వర్యంలోనే పని చేస్తున్నారు. సదరు ఉద్యోగి సూచనలు మేరకే సర్వేలు, సచివాలయాల్లో పనులు జరుగుతున్నాయని సమాచారం. చివరకు నివేదికలు, ఇతర సమాచారం కోసం జిల్లా అధికారులు కూడా అదే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ఆధారపడుతున్నారు.

రూ.4 వేలకు సర్టిఫికెట్

గురజాల టౌన్: అడిగినంత ఇస్తే చాలు ఏ సర్టిఫికెట్ అయినా గంటల్లోనే చేతికి అందుతోంది. ఆ సచివాలయంలో ఓ అధికారి బహిరంగంగానే నగదు వసూలు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాడు. తనకు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలుసని వసూళ్లలో మునిగితేలుతున్నాడు. సాధారణంగా జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లు పొందాలంటే దాదాపు నెల రోజులకుపైగానే పడుతుంది. కానీ గురజాల మండలం పులిపాడు-1 సచివాలయంలో ఓ అధికారి గంటల్లోనే ఆ సర్టిఫికెట్ ఇస్తాడు. ఉదయం రూ.4 వేలు ఇచ్చి తల్లిదండ్రుల ఆధార్ కార్డులను వాట్సాప్ చేస్తే సాయంత్రం కల్లా జనన, మరణ ధ్రువీకరణ పత్రం చేతికి అందుతోంది. ఇటీవల గురజాలకి చెందిన ఓ వ్యక్తి సదరు ఉద్యోగికి రూ.4 వేలు ముట్టజెప్పి సర్టిఫికెట్‌ను పొందగా దానిని ఓ ప్రభుత్వ ఉద్యోగికి చూపించగా అది నకిలీదని తేలింది. నకిలీ బాగోతం అధికారులకు తెలిసినా వారు పట్టించుకోకపోవడంతో ఆ సచివాలయ అధికారి చెలరేగిపోతున్నాడు. ఈ అధికారికి మండల పరిధిలోని పలువురు గ్రామ కార్యదర్శులు, మండల అధికారులు సహకరిస్తున్నట్లు సమాచారం. జనన, మరణ సర్టిఫికెట్లే కాక గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కో సదరన్ సర్టిఫికెట్‌కు రూ.20 వేల దాకా తీసుకొని అధిక మొత్తంలో నకిలీ సర్టిఫికెట్లు అందించారనే ఆరోపణలు ఈ అధికారిపై ఉన్నాయి.



గుంటూరు జనరల్ ఆసుపత్రి వద్ద ఉన్న డివైడర్‌పై కూర్చుని ఉన్న పిచ్చి తల్లి

పిచ్చి తల్లి ఎదురుచూపులు!

నవమాసాలు మోసి, కని, పెంచి పెద్ద చేసిన పిల్లల కోసం ఎన్ని అవమానాలు, ఛీదరింపులు, ఛీత్కారాలు, మోసాలు ఇలా ఎన్ని ఎదురైనా ఏకబిగువున ఓర్చుకుంటుంది. మరి, తన కడుపున పుట్టిన పిల్లలే తనను మోసం చేస్తే.. ఆ తల్లి తట్టుకోలేదు.. పిచ్చెక్కిన్నట్లు అవుతుంది. ఇందుకు ఉదాహరణనే పై ఫొటోలో కనిపిస్తున్న ఓ పిచ్చి తల్లి. గుంటూరు జనరల్ ఆసుపత్రి ఎదుట ఉన్న డివైడర్‌పై పడుకొని ఆమె కాలం వెళ్లదీస్తూ ఉంటుంది. వాస్తవానికి ఆమెకు పిచ్చి లేదు. కడుపున పుట్టినబిడ్డలే ఆమెను పిచ్చి దానిని చేశారు. తెల్లవారేసరికి, చక్కగా తయారవుతుంది. తన సంచులన్నీ సర్దుకుని వచ్చిపోయే వాహనాలను గమనిస్తూ కూర్చుంటుంది. వస్తారో రారో కూడా తెలియని పిల్లల కోసం గంటల తరబడి ఎదురు చూసే ఆమె, చాలాసార్లు తన తిండి గురించి కూడా పట్టించుకోదని అక్కడి వాళ్లు చెబుతున్నారు. ఎవరైనా ఆమె వద్దకు వెళ్లి వివరాలు అడిగితే చెప్పే సమాధానాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. 'నా పేరు మేరీ' (నిజమో కాదో తెలియదు) అని చెబుతుంది. 'పిల్లలు ఎంత మంది?' అని అడిగితే 'పచ్చి బాలింతను' అని 'ఇక్కడ ఎందుకు ఉన్నావు?' అంటే, 'పిల్లలు వస్తారు.. తీసుకుపోతారు' అని చెబుతుంది. గత కొన్ని నెలలుగా ఆమెను అడిగినవారికి ఇవే వివరాలు చెబుతోంది. ఏ క్షణంలోనైనా తన పిల్లలు వచ్చి తనను తీసుకెళతారనే నమ్మకంతో ఉన్న ఆ పిచ్చితల్లి రాత్రి పూట ఏడుస్తూ పడుకుంటుంది. - (గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ధనుర్మాస వ్రత దీక్షలతో పుణ్యఫలం

మంత్రి నారా లోకేశ్



మంగళగిరి సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామికి అత్యంత ఇష్టమైన ధనుర్మాసంలో దీక్షలను ఆచరించడం వలన పుణ్యఫలం సిద్ధిస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి శ్రీశైల నగర్‌లోని బాపూజీ విద్యాలయంలో వైటీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో త్రిదండి చినజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో మంత్రి లోకేశ్ మంగళవారం రాత్రి పాల్గొన్నారు. చినజీయర్ స్వామి మంత్రి లోకేశ్‌కు ఆశీర్వచనాలు అందజేసి కొద్దిసేపు ఆధ్యాత్మిక అంశాలపై చర్చించారు. మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఎగువ, దిగువ సన్నిధులు, విజయకీలాద్రి క్షేత్రాలను ధనుర్మాసంలో దర్శించుకోవడం ద్వారా మంచి జరుగుతుందన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపైనా వుండాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

ముక్కోటి ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

- 10న ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం



మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం



మంగళగిరిలోని ఆలయం వద్ద క్యూ ఏర్పాటు

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాలు సన్నద్ధమవు తున్నాయి. ఇప్పటికే ఆయా ఆలయాల పాలక కమిటీలు, అధికారులు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో ఆలయ సిబ్బంది ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా అమరావతి వైకుంఠపురంలోని క్రౌంచగిరిపై స్వయంభువుగా వెలిసిన కలియుగదైవం వెంకటేశ్వరస్వామి ఆలయం, తెనాలి పట్టణంలోని సుప్రసిద్ధ క్షేత్రం వైకుంఠపురంలో వెలిసిన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, మంగళగిరిలోని మంగళాద్రి శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంతో పాటు ఆలయాల వద్ద గోపురాల అలంకరణలతో పాటు, స్వామివార్ల దర్శనం, భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు ముమ్మంగా జరుగుతున్నాయి.

మంగళగిరి సిటీ, తెనాలి అర్బన్, అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో ముక్కోటి ఉత్సవాలకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరుగనున్నాయి. 9న రాత్రి 8 గంటలకు శ్రీ స్వామి వారిని జగన్మోహినిగా అలంకరిస్తారు. 10వ తేది తెల్లవారుజాము ఒంటి గంట నుంచి 3 గంటల వరకు స్వామివారికి తిరువంజనోత్సవం, అనంతరం వేకువజాము 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బంగారు గరుడ వాహనంపై శ్రీవారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి ఏడాది మాదిరిగానే రెండు రోజులపాటు అంటే శుక్ర, శనివారాల్లో శంకుతీర్థం అందించనున్నారు. పదవ తేదీ రాత్రి నమ్మాళ్వార్ అధ్యయనోత్సవాలు (కొరాయి ఉత్సవాలు) ప్రారంభమవుతాయి. ఈ ఏడాది ముక్కోటి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఎగువ, దిగువ సన్నిధుల్లో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఎగువ, దిగువ సన్నిధులను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. వైద్యం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ తదితర సమస్యలు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఇతర అధికారులు మంగళవారం ముక్కోటి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తెనాలిలోని వెంకటేశ్వరస్వామి వారి ఆలయం

తెనాలి పట్టణంలోని సుప్రసిద్ధ క్షేత్రం వైకుంఠపురంలో ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు గావిస్తున్నామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ కంభం సాయిబాబు చెప్పారు. శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇందుకు చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం విలేకర్లకు వివరించారు. ఉత్తర ద్వార దర్శనం విశేషాలతో రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామి అమ్మవార్లను ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై అలంకరించి భక్తులకు దర్శనం ఇప్పిస్తారు. దక్షిణావృత శంఖంతో తీర్థం పంపిణీ చేస్తారు. అనంతరం స్వామి అమ్మవార్ల మూలవరులను దర్శించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు గావిస్తున్నామని, క్యూ లైన్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. భక్తులకు తాగునీరు, పిల్లలకు, బాలింతలకు పాలు పంపిణీ, ఉచిత ప్రసాదం అందజేసేందుకు 7 వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈవో అనుపమ, అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేద వ్యాస మహర్షి ఆలయం

అమరావతి వైకుంఠపురంలోని కలియుగ వైకుంఠ క్షేత్రంగా పేరుగాంచిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీ ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. తెల్లవారు జామున 4గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ఋత్విక్కులు స్వామివారి పాదలకు పాలాభిషేకం చేసి అనంతరం ప్రత్యేక అలంకారం, 5గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించడం జరుగుతుంది. స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయ ఉత్తర ద్వారంలో ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. 10 గంటలకు స్వామివార్ల గ్రామోత్సవం గరుడ వాహనంపై గ్రామ పురవీధులు, ఆలయ మాడ వీధులలో జరుగుతుంది. ఆలయాన్ని సందర్శించిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడం జరుగుతుంది. ముక్కోటి పర్వదినం రోజునుండి ఐదు రోజుల పాటు అధ్యయన ఉత్సవాలు జరుగుతాయని ఉదయం సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.



మంగళగిరిలో ముక్కోటి ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థానం, ఎంటీఎంసీ అధికారులు

'బంగారు బాల్యం'కు స్కోచ్ అవార్డు

- దేశవ్యాప్తంగా ఆసంస్థ పరిశీలించిన 13 ప్రాజెక్టుల్లో ప్రథమ స్థానం
- బాలల రక్షణ కోసం ప్రత్యేకంగా సాగుతున్న కార్యక్రమం
- కలెక్టర్ అన్సారియా చొరవతో అమలు



ఆగస్టు 29న ఒంగోలులో ప్రాజక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కైలాస్ సత్యర్థి

ఒంగోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బాల్య వివాహాల నిషేధం, బాలికల్లో అక్షరాస్యత పెంపు, సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంతో చేపట్టిన బంగారు బాల్యం ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ అవార్డుకు ఈ ప్రాజెక్టు ఎంపికైంది. ఆసంస్థ పరిశీలించిన 13 ప్రాజెక్టుల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక చొరవ తీసుకొని దీన్ని అమలు చేస్తున్నారు. త్వరలో ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకోనున్నారు.

వివిధ శాఖల భాగస్వామ్యం..

గత ఏడాది జూన్ ఆఖరులో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్సారియా తొలి నెల రోజుల్లోనే బాలికల అంశంపై దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా అత్యధిక బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లాల్లో ముందు వరుసలో మన జిల్లా ఉన్న విషయాన్ని గుర్తించారు. మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో అనేక మంది పిల్లలు, మహిళలు ప్రత్యేకించి బాలికలు, గర్భిణులు... పౌష్టికాహారం లోపం, రక్తహీనతతో ఉన్న విషయాన్ని గమనించారు. వారిలో అక్షరాస్యత కూడా అతి తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈనేపథ్యంలో ఒక వైపు బాల్య వివాహాల నిరోధం, మరోవైపు బాలికలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య రక్షణ, అక్షరాస్యత పెంపుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని తలచారు. ఐసీడీఎస్, విద్య, వైద్య ఆరోగ్య ఇతర శాఖల భాగస్వామ్యంతో ఆ తరహా కార్యక్రమానికి రూపకల్పన చేసే ప్రయత్నంలో అది ఒక ప్రాజెక్టు తరహాలో ఉండాలన్న అభిప్రాయాన్ని పలువురు అధికారులు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే బంగారు బాల్యం పేరుతో ప్రాజెక్టు చేపట్టారు.

ఆగస్టు 29న ప్రారంభం

జిల్లాలో 2024 ఆగస్టు 29న ఒంగోలులో బంగారు బాల్యం ప్రాజెక్టును ప్రారంభించారు. బాలల హక్కుల ఉద్యమ కారుడు, నోబెల్ అవార్డు గ్రహీత డాక్టర్ కైలాస్ సత్యర్థిని ఇక్కడికి తీసుకు వచ్చి ఆయన ద్వారా ప్రాజెక్టును ప్రారంభింపజేశారు. 18 ఏళ్లలోపు ఆడ పిల్లలపై ప్రధానంగా దృష్టి సారిస్తూ వారిలో అక్షరాస్యత, ఆరోగ్యం, ఆర్థిక, సామాజిక సామర్థ్యాల పెంపుపై విస్తృత అవగాహనకు శ్రీకారం పలికారు. ప్రజలను చైతన్యం చేయడంలో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేశారు. నవంబరు 14 నుంచి 20 వరకు ప్రత్యేక వారోత్సవాలు చేపట్టి గ్రామగ్రామానా అవగాహన ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో బాల్య వివాహాల నిరోధక కమిటీలు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు, వెలుగు, మెప్మాల ద్వారా మహిళలతో సమావేశాలు నిర్వహిస్తూ రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కూడా క్రియాశీలకంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టారు. గత ఆరు నెలల్లో జిల్లాలో ఏకంగా 30 బాల్య వివాహాలను స్థానికులు ఇచ్చిన సమాచారంతో అధికారులు అడ్డుకోగలిగారు. ఈ సమయంలో బంగారు బాల్యం ప్రాజెక్టుకు దేశంలో గుర్తింపు ఉన్న స్కోచ్ అవార్డు-24 లభించడం జిల్లా యంత్రాంగానికి మరింత ప్రోత్సాహకరంగా నిలవనుంది.



పోలీసులకు చిక్కిన రేషన్ బియ్యం లారీ

230 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఇంకొల్లు, జనవరి 7, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు సమీపంలో కడవకుదురు రోడ్డులోని భీమవరం పుట్ల వద్ద మినీ లారీలో తరలివెళ్తున్న 230 బస్తాల రేషన్ బియ్యాన్ని ఇంకొల్లు పోలీసులు పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి చినగంజాం నుంచి ఇంకొల్లు వైపు మినీలారీలో బియ్యం తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు వాటిని పట్టుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. లారీ డ్రైవర్ గొట్టిపాటి వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకొని బియ్యం లారీని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. వెంకటేశ్వరరావును విచారించగా గోగినేని వెంకటరమణ అనే వ్యక్తి చినగంజాంలో బియ్యంను లారీకి లోడ్ చేయించారని తెలిపినట్లు ఎస్సై తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాతావరణ పరిస్థితుల వల్లే మిర్చికి తెగుళ్లు

ఏవో రవిప్రసాద్‌బాబు



మిర్చి రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో రవిప్రసాద్‌బాబు

పర్చూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి) ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మిర్చి పైర్లకు తెగుళ్ళ సమస్య నెలకొందని హార్టికల్చర్ ఏవో రవి ప్రసాద్‌బాబు అన్నారు. చల్లని వాతావరణంతోపాటు, ఇటీవల కురిసిన వర్షాల నుంచి సరైన పగటి ఉష్ణోగ్రత లేకపోవడంవల్ల తెగుళ్ల ఉధృతి పెరిగిందన్నారు. దీంతో నల్లతామర పురుగు, నల్లనల్లి, బొబ్బర తెగుళ్లకు ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితి అనుకూలంగా మారిందన్నారు. తెగుళ్లతో మిర్చి రైతుల బెంబేలు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై హార్టీకల్చర్ అధికారులు స్పందించారు. మంగళవారం పర్చూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో మిర్చి పైర్లను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ప్రస్తుతమున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులను వాడకుండా మధ్యలో బవేరియా బాసియానా, వర్టిసీలియా ద్రావకాలను సాయంత్రం వేళల్లో 5 మిలీ నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే నల్లతామర పురుగు నివారణకు సైనోసాడ్ 0.5 ఎంఎల్ లీటరు నీటికి లేదాఅబామెక్సిన్ 0.5లీటర్ల నీటిలో కలిపి పిచాకారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందని సూచించారు.

ఏపీ ఎయిడెడ్ కళాశాలల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంటర్ బోర్డు కమిషనర్

చీరాలటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇంర్ బోర్డు కమిషనర్ కృత్తిక శుక్ల మంగళవారం ఆమె చాంబర్‌లో ఆవిష్కరించారు. స్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి పుష్పరాజు, జనరల్ సెక్రటరీ చావా రామారావు మర్యాదపూర్వకంగా కలిసి ఆవిష్కరింపజేశారు. అనంతరం ఎయిడెడ్ కళాశాలల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను అందించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు.

ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్‌గా జాన్సన్

అల్లూరి జిల్లాకు లోకేశ్వరరావు బదిలీ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్ (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్)గా ఈఎస్ జాన్సన్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతిపై జాన్సన్ జిల్లాకు వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వీఎస్ లోకేశ్వరరావు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన అక్కడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా నియమితులయ్యారు.

ఇరుగు పొరుగు వివాదంలో అన్నదమ్ములపై దాడి



తీవ్ర రక్త గాయాలతో వెంకటేష్



అపస్మారక స్థితిలో గణేష్

చీరాలటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటి సరిహద్దులు విషయంలో నెలకొన్న వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. ఏకంగా అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి అన్నదమ్ములపై ఇనుప రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చీరాల మునిసిపల్ పరిధిలోని గొల్లపాలెంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. మారుబోయిన నాగేశ్వరమ్మ, గవిని ముత్తయ్య ఇరుగు పొరుగు వారు. ఈక్రమంలో వీరికి ఇంటి సరిహద్దులు విషయంలో గతకొంత కాలంగా వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ముత్తయ్య, నవీన్, వెంకటేష్, సుబ్బరావమ్మ ఇనుప రాడ్లతో ఇంట్లోకి చొరబడి ఘోరంగా దాడి చేశారు. దీంతో అన్నదమ్ములు వెంకటేష్, గణేష్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే బంధువులు వీరిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించగా, వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో చీరాల్లోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. హాస్పిటల్‌కు చేరిన వెంటనే పెద్ద వాడైన వెంకటేష్ ఓ సోషల్ మీడియాలో నేను ఆమంచికి అనుకూలంగా పోస్టులు పెడుతున్నానని దాడి చేశారని చెప్పగా, రెండో వర్గం వారు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వీరిపై ఫిర్యాదు చేశారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- జిల్లాకు వచ్చేవారి కోసం 264 సర్వీసులు
- ఆర్ఎం సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న ఆర్ఎం సుధాకర్‌బాబు

ఒంగోలు, కార్పొరేషన్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాకు వచ్చేవారి కోసం ఆర్టీసీ ప్రకాశం రీజియన్ పరిధిలో 264 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం బి.సుధాకర్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. హైదరాబాద్ నుంచి 242, బెంగళూరు నుంచి 12, చెన్నై నుంచి 10 సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా కానీ, ఏటీబీ ఏజెంట్ ద్వారా కానీ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. రాను, పోను ఒకేసారి రిజర్వేషన్ చేయించుకున్న వారికి చార్జీలో 10 శాతం రాయితీ ఉంటుందని వెల్లడించారు. ఏసీ స్లీపర్, నాన్ ఏసీ స్లీపర్ సర్వీసులు కూడా సాధారణ చార్జీలతోనే నడుపుతున్నట్లు ఆర్ఎం తెలిపారు.

డ్వామాలో నేడు, రేపు కీలక విచారణ

ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నోటీసులు

ఒంగోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : డ్వామాలో పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై కీలకమైన విచారణను త్రిసభ్య కమిటీ బుధ, గురువారాల్లో చేపట్టనుంది. శీనారెడ్డిపై ఫిర్యాదు చేసిన వారితో పాటు పలు అంశాలతో సంబంధం ఉన్న 36 మంది ఉద్యోగులను విచారించనుంది. ఈమేరకు త్రిసభ్య కమిటీకి నేతృత్వంలో వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు ముందుగానే నోటీసులు పంపించారు. దాదాపు నెల రోజులుగా డ్వామాలో విచారణ ప్రక్రియ కొనసాగుతున్న విషయం విదితమే. నేరుగా ప్రభుత్వం నుంచి కొన్ని, కలెక్టర్ నుంచి వచ్చిన మరికొన్ని ఫిర్యాదులను విచారిస్తున్న త్రిసభ్య కమిటీ వాటిలో చాలా వరకూ వాస్తవమని గుర్తించింది. ప్రధాన ఫిర్యాదుదారుడైన పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌తోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న శీనారెడ్డిని ఇప్పటికే వ్యక్తిగతంగా విచారించింది. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఫైళ్లను కూడా కొంత మేరకు పరిశీలించింది. పలు అక్రమాలు, అవకతవకలు గుర్తించింది. కొన్ని అంశాలలో అనేకమంది ఉద్యోగుల పాత్ర కూడా ఉందన్న నిర్ధారణకు వచ్చింది. కమిటీకి అందిన ఫిర్యాదుల్లో కొందరి పేర్లు కూడా ఉన్నాయి. దీంతో ఫిర్యాదులో పేర్కొన్న, ఫైళ్ల పరిశీలన సమయంలో భాగస్వామ్యం ఉండే అవకాశం ఉందని తాము గుర్తించిన ఉద్యోగులందరినీ వ్యక్తిగతంగా విచారించాలని త్రిసభ్య కమిటీ సభ్యులు నిర్ణయించుకున్నారు. అందుకోసం బుధ, గురువారాల్లో కీలక విచారణ చేపడుతున్నారు. తొలిరోజైన బుధవారం ఫిర్యాదుదారులైన ఐదుగురిని విచారించనున్నారు. గురువారం డ్వామాలో ఏపీడీ నుంచి అటెండర్ వరకు వివిధ స్థాయిల్లో ప్రస్తుతం పనిచేస్తున్న, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన 31 మంది ఉద్యోగులను విచారిస్తారు. వారిలో కొందరు డ్వామా జిల్లా కార్యాలయంలో, మరికొందరు వివిధ మండలాల్లో పనిచేస్తున్నారు. తాము గుర్తించిన అక్రమాలపై లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకొనే యోచనలో కమిటీ ఉన్నట్లు సమాచారం.

అవినీతిపరులు అవుట్!

- భూమి మ్యుటేషన్‌కు లంచం డిమాండ్ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు
- కనిగిరి తహసీల్దార్, వీఆర్వో సస్పెన్షన్
- అర్జీదారుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆర్ఐపైనా వేటు
- కలెక్టర్ అన్సారియా ఉత్తర్వులు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతు (ఫైల్)

కనిగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : భూమి మ్యుటేషన్‌కు లంచం డిమాండ్ చేసిన కనిగిరి తహసీల్దార్ అశోక్‌రెడ్డి, మరపగుంట్ల వీఆర్వో రాధపై వేటు పడింది. వారితోపాటు అర్జీదారుడి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆర్ఐ పురుషోత్తంరెడ్డిని కూడా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. కనిగిరి మండలంలోని పునుగోడు గ్రామానికి చెందిన వరికూటి మాలకొండయ్యకు 30 ఎకరాల పొలం ఉంది. ఆయన మరణం అనంతరం కుమారులు నలుగురు భూమిని భాగపంపకాలు చేసుకున్నారు. వారికి చదువు రాకపోవడంతో రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్, ఆన్‌లైన్ బాధ్యతను మాలకొండయ్య మనుమడైన మహేష్ రెడ్డికి అప్పగించారు. ఆయన నాలుగు నెలల క్రితం పునుగోడు వీఆర్వోగా పనిచేస్తున్న రాధను సంప్రదించారు. ఆమె రూ.2.50లక్షల లంచం డిమాండ్ చేశారు. ఆ మొత్తాన్ని తహసీల్దార్‌కు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. తహసీల్దార్ కారు డ్రైవర్ చేత ఆమె బేరసారాలు సాగించారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం జరిగిన ఫోన్ సంభాషణలను మహేష్‌రెడ్డి రికార్డు చేశారు. ప్రస్తుతం వీఆర్వో రాధ వెలిగండ్ల మండలంలోని మరపగుంట్ల వీఆర్వోగా పని చేస్తున్నారు. ఈనెల 4న పునుగోడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొనగా రెవెన్యూ లంచం గురించి మహేష్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఫోన్ సంభాషనను కూడా వినిపించారు. ఆర్ఐ పురుషోత్తమ్‌రెడ్డి కూడా తన పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు ఆయన ఆరోపించారు. దీంతో సీరియస్ అయిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అర్జీదారుడి నుంచి లంచం డిమాండ్, ఆర్ఐ దురుసు ప్రవర్తన నిజమేనని ఉన్నతాధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. దీంతో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలను కలెక్టర్ సస్పెండ్ చేశారు.



వెంకటేశ్వరరావు వర్థంతి సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గరటయ్య

అందరికీ ఆప్తుడు వెంకటేశ్వరరావు

- గ్రామాభివృద్ధికి సహకరిస్తాం
- ఆలపాటి కుమారులు

మేదరమెట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సదరన్ ట్రావెల్స్, సదరన్ గ్రూప్ ఆఫ్ హోటల్ వ్యవస్థాపకుడు ఆలపాటి వెంకటేశ్వరరావు ఎంతో కష్టపడి అంచెలంచలుగా ఎదిగారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచు గరటయ్య అన్నారు. మంగళవారం వెంకటేశ్వరరావు స్వగ్రామం పాసంగులపాడులో జరిగిన ఆయన ప్రథమ వర్థంతి కార్యక్రమానికి గరటయ్య, డాక్టర్ రావిపాటి ప్రసాదరావు, రిటైర్డ్ ఎస్పీ పాలేటి అనిల్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా గరటయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి ఢిల్లీ వెళ్లి అందరికీ అక్కడ ఆతిథ్యం ఇవ్వడంలో వెంకటేశ్వరరావు ముందుండేవారని గుర్తు చేశారు. ప్రాసంగులపాడుతో పాటు చుట్టుపక్కల గ్రామాలలోని పలువురుని తీసుకువెళ్లి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సదరన్ ట్రావెల్స్ వెంకటేశ్వరరావు అంటే తెలియని రాజకీయ నాయకుడు లేరంటే అతిశయోక్తి కాదు. ఏవీ రావుగా అందరికీ సుపరిచితులన్నారు. ఆయన కుమారులు ఆలపాటి కృష్ణమోహన్, ఆలపాటి ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి తప్పకుండా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాచిని చెంచుప్రసాద్, శ్రీరామ్ గ్రూప్ సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సాతులూరి తాండవ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆ.. చేద్దాంలే

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆదేశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిని సెట్ సరి చేయకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందులు తలెత్తుతాయని కొందరు జిల్లా అధికారులు బహిరంగంగానే అంటున్నారు. కొందరు సచివాలయ ఉద్యోగుల్లో గత ప్రభుత్వంపై ఇప్పటికీ కృతజ్ఞత ధోరణి కనిపిస్తోందని అందువల్లే వారు ఇప్పటి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్నారని కొందరు అంటున్నారు. అందువల్లే ప్రభుత్వ ఆదేశాలను సక్రమంగా పాటించకపోవడం.. పనులపై నిర్లక్ష్యం చేస్తున్నారని తెలుస్తోంది.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హవా

సచివాలయ ఉద్యోగుల పనితీరు, వివరాల సేకరణపై కూడా గుంటూరు జిల్లాలో వివాదం నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ మంత్రి దగ్గర ఉండి చాలా మంది జిల్లా అధికారులను సైతం దబాయించి మాట్లాడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సచివాలయ ఉద్యోగుల వ్యవహారాలు చూస్తున్నారు. జిల్లాలోని మొత్తం సచివాలయ సిబ్బంది ఆయన ఆధ్వర్యంలోనే పని చేస్తున్నారు. సదరు ఉద్యోగి సూచనలు మేరకే సర్వేలు, సచివాలయాల్లో పనులు జరుగుతున్నాయని సమాచారం. చివరకు నివేదికలు, ఇతర సమాచారం కోసం జిల్లా అధికారులు కూడా అదే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ఆధార పడుతున్నారు.

రూ.4 వేలకు సర్టిఫికెట్

గురజాల టౌన్: అడిగినంత ఇస్తే చాలు ఏ సర్టిఫికెట్ అయినా గంటల్లోనే చేతికి అందుతోంది. ఆ సచివాలయంలో ఓ అధికారి బహిరంగంగానే నగదు వసూలు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాడు. తనకు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలుసని వసూళ్లలో మునిగితేలుతున్నాడు. సాధారణంగా జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లు పొందాలంటే దాదాపు నెల రోజులకుపైగానే పడుతుంది. కానీ గురజాల మండలం పులిపాడు-1 సచివాలయంలో ఓ అధికారి గంటల్లోనే ఆ సర్టిఫికెట్ ఇస్తాడు. ఉదయం రూ.4 వేలు ఇచ్చి తల్లిదండ్రుల ఆధార్ కార్డులను వాట్సాప్ చేస్తే సాయంత్రం కల్లా జనన, మరణ ధ్రువీకరణ పత్రం చేతికి అందుతోంది. ఇటీవల గురజాలకి చెందిన ఓ వ్యక్తి సదరు ఉద్యోగికి రూ.4 వేలు ముట్టజెప్పి సర్టిఫికెట్‌ను పొందగా దానిని ఓ ప్రభుత్వ ఉద్యోగికి చూపించగా అది నకిలీదని తేలింది. నకిలీ బాగోతం అధికారులకు తెలిసినా వారు పట్టించుకోకపోవడంతో ఆ సచివాలయ అధికారి చెలరేగిపోతున్నాడు. ఈ అధికారికి మండల పరిధిలోని పలువురు గ్రామ కార్యదర్శులు, మండల అధికారులు సహకరిస్తున్నట్లు సమాచారం. జనన, మరణ సర్టిఫికెట్లే కాక గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కో సదరన్ సర్టిఫికెట్‌కు రూ.20 వేల దాకా తీసుకొని అధిక మొత్తంలో నకిలీ సర్టిఫికెట్లు అందించారనే ఆరోపణలు ఈ అధికారిపై ఉన్నాయి.

ధాన్యంలో దోపిడీ

- మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం
- లభించన ప్రభుత్వ 'మద్దతు'
- నామమాత్రంగా పనిచేస్తున్న సర్కారు కొనుగోలు కేంద్రాలు
  భారీగా నష్టపోతున్న అన్నదాతలు
- పొదుపు సంఘాల పాత్రను మరిచిన అధికారులు

దర్శి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో ప్రైవేటు వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా పనిచేస్తున్నాయి. కొన్ని పేరుకే అన్నట్లు నడుస్తుండగా, మరికొన్ని కొనుగోళ్ల ఊసే పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారుల ఇష్టారాజ్యమైంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందక అన్నదాతలు నష్టపోతున్నారు.

బస్తా రూ.1400, మూడు కేజీల తరుగు

ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం ధాన్యం గ్రేడ్-1 రకం 75 కేజీల బస్తా రూ.1740, సాధారణ రకం రూ.1725కు కొనుగోలు చేయాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో నడుస్తుంటే రైతులకు గిట్టుబాటు ధర లభించేది. కానీ అవి అలంకారప్రాయంగా మారాయి. ఇదేఅదనుగా భావించి ప్రైవేట్ వ్యాపారులు 75 కేజీల బస్తా రూ.1,400కు కొనుగోలు చేస్తున్నారు. మరో మూడు కేజీలు అదనంగా తరుగు కింద తీసుకుంటున్నారు. దీంతో బస్తాకు రూ.400మేర రైతులు నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాల తీరు అధ్వానంగా మారడం పట్ల అన్నదాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిధులు ఇచ్చినా ఆసక్తి చూపని సిబ్బంది

జిల్లాలో మొత్తం 32 కేంద్రాలు ఏర్పాటు చేయగా 15 రోజుల్లో కేవలం 4,159 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసినప్పటికీ పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తూ కొనుగోళ్లపై దృష్టి సారించడం లేదు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాల్సి వస్తుంది.

కొనుగోళ్లలో పొదుపు సంఘాల భాగస్వామ్యం నిల్

ధాన్యం కొనుగోళ్లలో పొదుపు సంఘాల పాత్రను అధికారులు మరిచారు. గతంలో సీఎం చంద్రబాబు మహిళలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో 2014 నుంచి 2019 వరకు కొనుగోళ్ల బాధ్యతను అప్పగించారు. సొసైటీలు, పొదుపు సంఘాలు ముమ్మరంగా కొనుగోలు చేసినప్పుడు రైతులకు న్యాయం జరిగింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఏడాది నామమాత్రంగా పొదుపు సంఘాలకు కొనుగోలు బాధ్యత అప్పగించి ఆ తర్వాత పక్కన పెట్టారు. వారికి ఇవ్వాల్సిన కమీషన్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొదుపు సంఘాలకు న్యాయం జరుగుతుందని మహిళలు ఆశపడ్డారు. అయితే అధికారులు మాత్రం వైసీపీ విధానాలనే కొనసాగిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే పొదుపు సంఘాలను ధాన్యం కొనుగోళ్ల నుంచి పక్కనపెట్టారు. దీంతోపాటు ఈ ఏడాది ప్రభుత్వం తరఫున కొనుగోళ్లు పూర్తిగా మందగించటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అవసరం కోసం ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితి గమనించి కొనుగోళ్లు ముమ్మరం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రారంభమైన ఉపాధి పనులు



చెరువు కట్టమీద పనిచేస్తున్న ఉపాధి కూలీలు

మార్టూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. మండలంలో సోమవారం దాదాపుగా 700 మందికి పైగా కూలీలు పనులకు హాజరయినట్లు తెలిసింది. గ్రామాలలో కూలీలుతో చెరువులు పూడిక తీత పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అదే విధంగా మేజరు పంచాయతీ మార్టూరులో మంచినీటి చెరువు కట్టపై గడ్డిని తొలగించే పనులు చేస్తున్నారు. వాస్తవంగా మంచినీటి చెరువు కట్టపై గడ్డిపెరగడంతో రోజూ వాకింగ్ కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందిగా ఉంది. దాంతో ఉపాధి కూలీలతో చెరువుపై శుభ్రం చేయిస్తున్నారు. చెరువు కట్ట పై పెరిగిన గడ్డి మొక్కలతో పురుగు పుట్ర వచ్చే ప్రమాదం ఉండడంతో వాకింగ్ కోసం వచ్చే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాంతో పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు సూచనలు చేరకు ఏపీవో ఆధ్వర్యంలో ఫీల్డు అసిస్టెంట్ అడకా లక్ష్మీనారాయణ ఉపాధి కూలీలతో చెరువు కట్ట పరిశుభ్రం చేయిస్తున్నారు.

మహావృక్షం మాయం!

- ఇష్టారాజ్యంగా ఆర్అండ్‌బీ చెట్ల నరికివేత
- 100 ఏళ్ల నాటి చింత బూడిద

ఇంకొల్లు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడ మమల్ని అడిగేదెవరు... మా స్వప్రయోజనాలే ముఖ్యం.. మమ్మల్ని ఆపేదెవరు అన్నట్లు కొందరు వ్యవహరిస్తున్నారు. ఇంకొల్లు నుంచి గంగవరం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో రెండు గ్రామాల మధ్య 24 ఎకరాలలో బోడిశెట్టి కుంట ఉండేది. 1989లో ప్రభుత్వం బోడిశెట్టి కుంటను ఓ ప్రైవేటు విద్యా సంస్థలకు అప్పగించింది. ఈ కుంటకు తూర్పువైపున ఉన్న ఆర్అండ్‌బీ రహదారి పక్కన 100 ఏళ్ల చరిత్ర కలిగిన మహా వృక్షం ఉంది. వారం రోజుల కిందట ఈ చింత చెట్టును నరికివేశారు. ఈ విద్యా సంస్థలను నడుపుతున్న ఓ ప్రైవేటు యాజమాన్యం తమ స్వప్రయోజనాలకు వందేళ్ల చరిత్ర కలిగిన చింతచెట్టును నరికి నామరూపాలు లేకుండా మాయం చేసింది. ఇక్కడ చెట్టు ఉండాలనే ఆనవాళ్లు లేకుండా మొదలుతో సహా కాల్చి బూడిద చేసారు. సమీపంలోని బస్సు షెల్టర్‌ను కూడా కూల్చారు. ఈ ఘటనపై సంబంధిత అధికారుల సైతం దోబూచులాడుతున్నారు. ఆర్అండ్‌బీ డీఈ నళినిని వివరణ కోరగా.. చెట్టు తొలగించిన సంగతి మాకు తెలియదని, మేము వచ్చి పరిశీలిస్తామన్నారు. కానీ సోమవారం వచ్చి పరిశీలించిన సంబంధిత అధికారులు ఈ విద్యాసంస్థలు ఓ మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించినవి కావడంతో గుట్టు చప్పుడు కాకుండా ఎటువంటి చర్యలు లేకుండా వెనుదిరిగి వెళ్లారు. వీరి ఆగడాలు ఆపేదెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



చెట్టును నరుకుతున్న దృశ్యం



ఆనవాళ్లు లేకుండా బూడిదైన వృక్షం



మహా వృక్షం (ఫైల్)



సిబ్బందికి నగదు అవార్డును అందజేసి అభినందిస్తున్న ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయాలి

- డీఎం రామ్మోహనరావు
- కండక్టర్‌లు, డ్రైవర్‌లకు నగదు అవార్డులు అందజేత

అద్దంకి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు సిబ్బంది మరింత కృషి చేయాలని డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు అన్నారు. డిసెంబర్‌లో ఎక్కువ ఈపీకే తీసుకు వచ్చిన కండక్టర్‌లు ఎం.ఏశేషయ్య, యూఎస్ రావు, మహేశ్వరి, ఎక్కువ కేఎంపీ తీసుకువచ్చిన డ్రైవర్‌లు బి.శ్రీరాములు, ఎంఎస్ మణ్యంకు మంగళవారం గ్యారెజ్‌లో జరిగిన కార్యక్రమంలో క్యాష్ అవార్డులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ మహబూబి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బీసీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

అద్దంకిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మండలంలోని సబ్సిడీ రుణాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరకాస్తుల స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో బీ సింగయ్య మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు ఓబీఎంఎంఎస్ వెబ్ సూట్ ద్వారా దరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలో బ్యాంక్ లిక్ యూనిట్లు బీసీలకు 17 యూనిట్లు మంజూరయ్యాయని, ఇందులో బీసీఏలకు 6 యూనిట్లు, బీసీబీలకు 2 యూనిట్‌లు, బీసీడీలకు 6, బీసీఈలకు 3 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. బీసీలకు, ఈబీసీలకు యూనిట్ విలువలో 40 నుంచి 50 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యూకేషన్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని ఎంపీడీవో తెలిపారు.

బల్లికురవ : అగ్రవర్ణాల్లోని నిరుపేదలకు ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తుందని, అర్హత ఉన్న వారు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలని ఎంపీడీవో కే కుసుమకుమారి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ రుణాలను ప్రభుత్వం అందజేస్తుందని అమె తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను బీసీ కార్పొరేషన్‌కు అందజేయాలని ఆమె కోరారు.

పంగులూరు : మండలంలో అర్హులైన బీసీ వర్గాలకు రుణాల మంజూరు కోసం ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి కోరారు. మండలానికి క్యాటగిరీలవారీగా బీసీ-ఏ 6, బీసీబీ 4, బీసీడీ 5, బీసీఈ 8 యూనిట్లు మంజూరయ్యాయని, ఆయా గ్రామాలకు కేటాంచిన క్యాటగిరీల వారీగా అర్హులైన వారు ఈ నెల 16వ తేదీలోగా తమ దరఖాస్తులు అందచేయాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్స్‌కు సంబంధించి క్యాటగిరీవారీగా ఈబీసీ 1, రెడ్డి - 4, కమ్మ-7, ఆర్యవైశ్యులకు ఒకటి యూనిట్లు మంజూరయ్యాయని, అర్హులైనవారు 16లోగా దరఖాస్తులు అందచేయాలని ఎంపీడీవో కోరారు.

చినగంజాం : మండల పరిధిలోని బీసీ, ఈబీసీ సామాజిక వర్గాల వారు రాయితీ రుణాలు కొరకు బుధవారం నుండి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్ ద్వారా అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. బీ.సీలు, ఈబీసీ(రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ) సామాజిక వర్గాల వారికి సంబంధిత బ్యాంకుల ద్వారా రాయితీ రుణాల కొరకు ఈ నెల 8వ తేది నుండి 16వ తేది వరకు గ్రామ సచివాలయాల్లో ఓబీఎంఎంఎస్ పోర్టల్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తదనంతరం లబ్దిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రాయితీ రుణాలపై ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో టాం టాం, ఇతర ప్రసార సాధనల ద్వారా ప్రచారం చేయాలని ఎంపీడీవో ఆదేశించారు.

అన్యాక్రాంతమైన భూములపై వినతి

బల్లికురవ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల నుంచి అన్యాక్రాంతంలో ఉన్న అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరించాలని కూకట్లపల్లి గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన వారు తహసీల్దార్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈసందర్భంగా గ్రామానికి చెందిన నిరుపేద దళితులు తమకు ప్రభుత్వం అందజేసిన అసైన్డ్ భూములను కొందరు అక్రమించి సాగు చేస్తున్నారని ఈ విషయాన్ని గతంలో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వారు తహసీల్దార్‌కు చెప్పారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నిరుపేదల తరపున సీపీఐ నేతలు తంగిరాల వెంకటేశ్వర్లు, పావులూరి రమణయ్య, గొల్లపూడి అంజయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

అద్దంకి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : లారీ పైనుంచి పడి గాయపడి చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ మహమ్మద్ అబ్బాస్(52) చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీస్‌ల కథనం మేరకు కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన మహమ్మద్ ఈ నెల 3వ తేదీన విజయవాడ నుంచి గుంటూరు నుంచి కాటన్‌సీడ్స్ లోడ్‌తో అద్దంకి మండలం చినకొత్తపల్లి వద్ద ఉన్న శ్రీ వత్సవ బయోటెక్ లిమిటెడ్ కంపెనీకి వచ్చారు. అన్‌లోడ్ అయిన తరువాత 4వ తేదీ సాయంత్రం లారీ పైన ఉన్న పట్టను మడత పెడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అబ్బాస్ కుమారుడు మగబుల్ ఫిర్యాదు మేరకు మంగళవారం ఏఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

బొడ్డువానిపాలెంలో బ్యారన్ దగ్ధం

- రూ.5 లక్షల ఆస్తి నష్టం

మేదరమెట్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డువానిపాలెంలో పొగాకుతో ఉండి క్యూరింగ్ జరుగుతున్న బ్యారన్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. మంగళవారం బొడ్డువానిపాలెంలకు చెందిన దేవరపల్లి అశోక్‌రెడ్డికి చెందిన బ్యారన్ పొగాకు కాలుస్తూ ఉండగా అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బ్యారన్‌లో ఉన్న పొగాకుతో పాటు బ్యారన్‌లోని సామగ్రి మొత్తం కాలిపోయింది. సుమారు రూ.5లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు అశోక్‌రెడ్డి తెలిపాడు. అద్దంకి నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వ్యక్తిపై కేసు నమోదు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇంట్లోకి చొరబడేందుకు యత్నించిన వ్యక్తిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన నక్కల పోతురాజు సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా అదే ప్రాంతానికి చెందిన గడ్డం ఏసు అర్ధరాత్రి ఇంటి వద్దకు వచ్చి అక్రమంగా ఇంట్లోకి చొరబడే ప్రయత్నం చేశాడు. దీంతో పోతురాజు ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏసుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాస్కులను అందజేస్తున్న డాక్టర్ సౌమ్య, టీడీపీ నేతలు

వైరస్‌పై భయాందోళన వద్దు

- వ్యక్తిగత శుభ్రత, మాస్కులు తప్పనిసరి
- ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య

పర్చూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం చైనాలో వ్యాప్తి చెందుతున్న హెచ్ఎంపీవీ వైరస్ పట్ల ప్రజలు భాయాందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యక్తిగత పరిశుభ్రత, మాస్కులు ధరిస్తే దరిచేరదని డాక్టర్ జే సౌమ్య అన్నారు. హెచ్ఎంపీవీ వైరస్ దృష్ట్యా ముందస్తు చర్యలో భాగంగా మంగళవారం స్థానిక టీడీపీ నేతలు సారథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వైద్య సిబ్బందికి మాస్కులు శానిటైజర్లను పంపిణీ చేశారు. దీంతో పాటు పండ్లు కూడా రోగులకు అందజేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి సౌమ్య మాట్లాడుతూ తరుచూ జ్వరం వస్తుంటే అశ్రద్ధ చేయవద్దన్నారు. సొంత వైద్యానికి స్వస్తి చెప్పి వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వాణిజ్య విభాగంగా ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాద్, పరివర్తన భవనం అధ్యక్షుడు జూపూడి మార్కు, టీడీపీ సీనియర్ నేత కె.మార్కు, వడ్డెముక్కల అబ్రహం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెండోరోజూ పింఛన్‌దారుల పరిశీలన



అద్దంకిలో మంచంపై ఉన్న పింఛన్‌దారును పరిశీలిస్తున్న వైద్యులు

అద్దంకిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి దివ్యాంగుల పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం రెండవ రోజూ వైద్య బృందం పరిశీలించింది. ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ హరిబాబు, సాధారణ వైద్యులు డాక్టర్ విన్సీ దయానా, అద్దంకి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ అద్దంకి పట్టణంలోని పలువురిని పరిశీలించారు. దివ్యాంగుల పింఛన్ పొందుతూ మంచంలోనే ఉండే వారు, డయాలసిస్, ఇతర అనారోగ్య సమస్యలతో పింఛన్ పొందుతున్న వారి ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. వివరాలను నమోదు చేసుకున్నారు. మండలంలోని మైలవరం, కొత్త రెడ్డిపాలెంలలో వైద్యుల బృందంతో పాటు మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీహర్ష లబ్ధిదారులను పరిశీలించారు. వారి వెంట ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు, ఆరోగ్యకార్యకర్తలు ఉన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మానవసేవే - మాధవసేవని.. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం ఆనందదాయకమని ఎన్ఆర్ఐ దంపతులు రామిశెట్టి దిలీప్ కుమార్, అనూష అన్నారు. వైకుంఠపురానికి చెందిన ధనలక్ష్మి, తోటవారిపాలెంకు చెందిన సాయి ఇద్దరు దివ్యాంగులు కావడంతో వారికి లెట్స్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ దంపతుల ఆర్థిక సహకారంతో ట్రై సైకిల్స్‌ను అందజేశారు. ఈసందర్భంగా సంస్థ ప్రతినిధులు కిరణ్ మాట్లాడుతూ దాతల సాయంతో ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దయాకర్, డేవిడ్, రాజేష్, సాంబయ్య, ప్రకాష్, సుభాని, మధు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాలక్ష్మి నవరాత్రి ఉత్సవాలు

- చందలూరులో కొలువైన అమ్మవారు
- ఏర్పాట్లు చేస్తున్న వంశస్థులు

పంగులూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహాలక్ష్మి అమ్మవారి నవరాత్రి కొలుపు మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదున్నర శతాబ్దాల నాడు కొలువుదీరిన మహాలక్ష్మి అమ్మవారిని తమ ఇంటి ఇలవేల్పుగా, ఇష్ట దైవంగా కొలిచే గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ మహోత్సవంలో పాల్గొంటారు. మూడేళ్లకోసారి జరిగే మహాలక్ష్మి అమ్మవారి కొలుపు ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థుల సహకారంతో ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. 8, 9 తేదీలలో మానుపూజ నిర్వహించి త్రిశక్తి స్వరూపిణిగా అమ్మవారి ఆహ్వాన సంకల్పం తీసుకోవడం, ముత్తయిదువులకు పంచ మాంగళ్యాల పంపిణీ అనంతరం 10వ తేదీ అర్ధరాత్రి నుంచి గ్రామోత్సవం ప్రారంభమవుతుందని గణాచారి బ్రహ్మశ్రీ వేదమూర్తివర్యులు చల్లా సత్యనారాయణ శాస్త్రి తెలిపారు. గ్రామస్థులు, భక్తుల సిద్ధాంసారం మూడేళ్లకోసారి జరిగే ఈ కొలుపు మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొంటారు.



ప్రత్యేక అలంకరణలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారు

10 అర్ధరాత్రి నుంచి 17వ తేదీ వరకు గ్రామోత్సవం

మానుపూజతో ప్రారంభమయ్యే మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవంలో 10 అర్ధరాత్రి నుంచి జరిగే అమ్మవారి ఊరేగింపు మహోత్సవంలో నిత్యం వేల సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, రాత్రి 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్దేశిత పుర వీధులలో ఈ ఉత్సవం కొనసాగుతుంది. తమ కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా భావించే భక్తులు అమ్మవారి విగ్రహంతో బయలుదేరిన గణాచారికి అభిముఖంగా వేలాది మంది అమ్మవారికి పూలు, తమలపాకులు సమర్పిస్తూ వెనుకు నడుస్తూ సాగే వేడుకతో నిత్యం గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపిస్తుంది. ఈ ఉత్సవంలో రోజుకు ఒకరు వంతున (చిట్టాబత్తిన, మురకొండ, పాలేరు, కళావంతులు, గొట్టిపాటి, పుల్లెల) వంశస్తులు నిర్వహించే ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ రంగాలలో వేరు వేరు ప్రాంతాలు, పట్టణాలలో స్థిరపడిన వారితో పాటు పలు రాష్ట్రాల ప్రజలు తమ మొక్కులు తీర్చుకునేందుకు చందలూరు చేరుకోవడంతో వారం రోజులుల పాటు గ్రామం జన సందోహంతో తిరుణాళ్లను తలపిస్తుంది. 18వ తేదీన మహాలక్ష్మి అమ్మవారికి పొంగళ్ల సమర్పణతో ఈ ఉత్సవం ముగుస్తుంది.

మణికేశ్వరం అభివృద్ధి పనుల పరిశీలన

అద్దంకి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవదాయశాఖ స్థపతి, ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. స్థపతి పరమేశ్వరప్ప, ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల డీఈ శ్రీనివాసరావు ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పరమేశ్వరప్ప దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, అశోక్, అంజయ్య, బడావలి, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండలో నిర్మాణ పనులు పరిశీలించిన స్థపతి

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణ పనులను స్థపతి పరమేశ్వరప్ప మంగళవారం పరిశీలించారు. దేవాలయంలో పరమేశ్వరప్ప దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఈ శ్రీనివాసరావు, ఈవో తిమ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.



మణికేశ్వరం దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప, ఇంజనీరింగ్ అధికారులు

పంట నమోదు చేయించుకోవాలి

చినగంజాం, జనవరి (ఆంధ్రజ్యోతి) : పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కే.భాస్కరరావు సూచించారు. మండలంలోని గొనసపూడి, సంతరావూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతరావూరు, గొనసపూడి గ్రామాల్లో రైతులు వేసిన పొగాకు, మిరప, జొన్న, వరి పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పీఎం కిసాన్ సంబంధించి రైతులు ఎవరైనా ఈకేవైసీ చేయించుకోని వారు చేయించుకోవాలని ఏవో తెలిపారు. పీఎం కిసాన్ డబ్బులు జమకాని రైతులు మా దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం రైతులు వేసిన పంట వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది సంధ్య, నీలిమ, గొనసపూడి, సంతరావూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఎస్ఎల్ గుడిపాడులో వరి పంటను పరిశీలిస్తున్న మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు

కత్తెర పురుగుపై అప్రమత్తం

అద్దంకిటౌన్ : మొక్కజొన్నలో కత్తెర పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం అద్దంకి గోవాడ, చిన్న కొత్తపల్లి గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎమమెక్టిన్ బెంజోయేట్ లీటర్ నీటికి గ్రాము కలిపి మొవ్వులో పిచికారీ చేయాలన్నారు. మిరపలో రసం పీల్చు పురుగు నివారణకు వేపనూనె పిచికారీ చేయాలని ఉద్యాన అధికారి ఎస్.దీప్తి తెలిపారు. కార్యక్రమంలో ఏవీవో కోటేశ్వరరావు, సాయిబాబు, రైతులు మానం మురళీమోహన్‌దాసు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

బల్లికురవ : రైతులంతా పంటలు సాగు చేసే ముందు భూములకు భూసార పరీక్షలను చేయించుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ మార్టూరు సబ్ డివిజన్ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించి పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడం వలన పెట్టుబడులు తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో కుమారి, వీఏఏ పవన్‌సాయి, రమణయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లు : శనగ పంటలో పచ్చ పురుగును నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని వంకాయలపాడు, సుబ్బారెడ్డిపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనగ పంటలను ఆయన పరిశీలించారు. పచ్చ పురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ 40మిలీ లేదా ఇండాక్సికార్బ్ 200మిలీ లేదా రైనాక్సిపైడ్ 60మిలీ ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం తనుబొద్దివారిపాలెం, మున్నంగి వారిపాలెం గ్రామాలలో వ్యవసాయ అధికారి మేరమ్మ శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. శనగ పైరులో లద్దెపురుగు నివారణకు రైతులకు పలు సూచనలుచేశారు.